“తిరుమల క్షేత్రదర్శిని గ్రంథమాల”

# శ్రీ వేంకటేశ్వరస్వామి అవతారం

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

“తిరుమల క్షేత్రదర్శిని గ్రంథమాల”

శ్రీ వేంకటేశ్వరస్వామి అవతారం

రచన
డా॥ సముద్రాల లక్ష్మణయ్య

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2012

# SRI VENKATESWARA SWAMY AVATARAM

*By*
**Dr. Samudrala Lakshmanaiah**

T.T.D. Religious Publications Series No. 903
© All Rights Reserved

*First Edition* : 2012

*Copies :*
*Price :*

*Published by:*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati.

***D.T.P:***
Editor in Chief Office,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

## ముందుమాట

**"వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి"**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేదు. ఇక మీదకూడ ఉండదు – అని అర్థం.

కలియుగ వైకుంఠంగా భాసిల్లే శ్రీ వేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొద్దిమంది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయడూ ఐన శ్రీ వేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 'తిరుమల క్షేత్రదర్శిని' అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో, ప్రస్తుతం **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** గారు రచించిన **'శ్రీ వేంకటేశ్వరస్వామి అవతారం'** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు అందజేస్తున్నాము. భక్తులీ గ్రంథంద్వారా స్వామివారి అవతార వైభవాన్ని తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో...

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


**ప్రథమ ప్రకరణం**

| | | |
|---|---|---|
| 1. | దశావతారాలు | 1 |
| 2. | ఐదు స్వరూపాలు | 4 |
| 3. | అర్చావతార విశిష్టత | 5 |
| 4. | శ్రీవేంకటేశ్వరుని అర్చావతారం | 5 |

**ద్వితీయ ప్రకరణం**

| | | |
|---|---|---|
| 5. | నారదుని ప్రశ్న | 7 |
| 6. | త్రిమూర్తుల పరీక్ష | 8 |
| 7. | వైకుంఠం వీడిన లక్ష్మీదేవి | 10 |
| 8. | వేంకటాచలం చేరిన విష్ణువు | 11 |
| 9. | బ్రహ్మరుద్రుల గోవత్సరూపాలు | 11 |
| 10. | పాలులేని గోవు | 12 |
| 11. | గోపాలుని మృతి | 13 |
| 12. | చోళరాజుకు శాపం | 13 |
| 13. | చింతచెట్టు - పుట్ట | 15 |
| 14. | వరాహస్వామితో కలయిక | 16 |
| 15. | వకుళమాలిక | 17 |
| 16. | ఆకాశరాజు - తొండమానుడు | 18 |
| 17. | పద్మావతి ఆవిర్భావం | 19 |
| 18. | పద్మావతి వనవిహారం | 20 |
| 19. | శ్రీనివాసునివేట - పద్మావతీ దర్శనం | 20 |

20. పద్మావతి పరితాపం 22

21. వేదవతీ వృత్తాంతం 23

22. వకుళమాత నారాయణ పురగమనం 25


**తృతీయప్రకరణం**


23. ఎఱుకతగా శ్రీనివాసుడు 28

24. ఎఱుకత గద్దె 29

25. ధరణీదేవితో వకుళ మాలిక సంభాషించుట 30

26. పద్మావతీ శ్రీనివాసుల పరిణయ శుభలేఖ 31

27. బ్రహ్మరుద్రాదుల రాక 32

28. లక్ష్మీదేవి ఆగమనం 33

29. అప్పుపత్రం 34

30. పద్మావతీ శ్రీనివాసుల పరిణయం 35

31. అగస్త్యాశ్రమ నివాసం 37

32. వసుదాన తొండమానుల యుద్ధం 38

33. విశ్వరూపదర్శనం 40

34. దేవాలయ నిర్మాణం 40

35. ఆనందనిలయప్రవేశం 41

36. భీమునికి సాయుజ్య ప్రదానం 42

37. తొండమానునికి సారూప్యం 44

38. అర్చావిగ్రహమూర్తి 45


**చతుర్థ ప్రకరణం**


39. వేంకటేశ్వరునికి లక్ష్మిని గూర్చిన చింత 47

40. పాతాళం చేరిన లక్ష్మి 49





41. ఆకాశవాణి పలుకులు 49

42. శ్రీవేంకటేశ్వరుని తపస్సు 50

43. కపిలముని హితవచనాలు 51

44. వ్యూహలక్ష్మి ఆవిర్భావం 52

45. విష్ణువక్షంపై లక్ష్మి 53

46. ఆనందనిలయంలో లక్ష్మీవేంకటేశ్వరులు 55

47. లక్ష్మీవేంకటేశ్వరుల వినోదసంభాషణ 55

48. వరలక్ష్మి శుకాశ్రమంలో నెలకొనడం 58

49. పద్మతీర్థ ప్రాశస్త్యం 59

# ప్రథమ ప్రకరణం

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదా౽౽త్మానం సృజామ్యహమ్ ॥**

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥**

ధర్మానికి క్షీణదశ కల్గినప్పుడు, అధర్మం తలయెత్తినప్పుడు తన్ను తాను సృజించుకుంటానని గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. శిష్టులను రక్షించడానికీ, దుష్టులను శిక్షించడానికీ, తద్ద్వారా ధర్మాన్ని నెలకొల్పడానికీ భగవాను డీ లోకంలో అవతరిస్తాడు.

భగవంతుడు ఏ రూపంలోనైనా ఆవిర్భవించడాన్నే అవతార మంటారు. అవతార శబ్దానికి దిగుట, రేవు, కోనేరు– ఇత్యాదిగా పలు అర్థాలున్నాయి. విశ్వవ్యాపి అయిన పరమాత్మ భక్తకోటిని అనుగ్రహించడానికి సగుణసాకార రూపంలో లోకానికి దిగిరావడాన్నే అవతారమని భావిస్తున్నాం.

## దశావతారాలు

భగవంతుని దశావతారాలు పురాణవాఙ్మయంలో విస్తృతంగా కీర్తించబడి వున్నాయి. లోకోపకారం చేయడానికే పరమపురుషుడు పది అవతారాలు దాల్చాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

**పరోపకృతి కైవల్యే తులయిత్వా జగద్గురుః ।**

**గుర్వీం చోపకృతిం మత్వా అవతారాన్ దశాగ్రహీత్ ॥**

జగత్తుకు గురువైన శ్రీమన్నారాయణునికి ఒకనాడొక సంశయం కల్గిందట! వైకుంఠంలో శ్రీదేవి తన్ను సేవిస్తుండగా హాయిగా కాలం గడపడం

మంచిదా? లేక సృష్టిలో బాధపడే ప్రాణుల బాధలు పోగొట్టి వారికి ఉపకారం చేయడం మంచిదా? –అని.

ఈ రెండు అభిప్రాయాలనూ ఒక త్రాసులో వేసి తూచగా పరోపకారం వైపే త్రాసు మొగ్గు చూపిందట! అంచేత పరోపకారం చేయాలని నిర్ణయానికి వచ్చిన భగవంతుడు పది అవతారాలు ధరించాడు. దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించాడు. ధర్మాన్ని నెలకొల్పాడు.

మత్స్యం, కూర్మం, వరాహం, నరసింహుడు, వామనుడు, పరశు రాముడు, శ్రీరాముడు, బలరాముడు (కృష్ణుడు), బుద్ధుడు, కల్కి అనేవి పురాణప్రసిద్ధాలైన దశావతారాలు.

ఇవే కాక సుయజ్ఞుడు, కపిలుడు, దత్తాత్రేయుడు, సనకాదులు, నరనారాయణులు, ధ్రువుడు, పృథువు, వృషభుడు, సుగ్రీవుడు, హంస, మనువు, ధన్వంతరి, వ్యాసుడు ఇత్యాదిగా మరికొన్ని అవతారాల ప్రస్తావన భాగవతంలో కనిపిస్తుంది.

మరియు భగవంతుని లీలావతారాలు లెక్కకు మిక్కిలిగా వున్నాయని శ్రీమద్భాగవతం పేర్కొంటున్నది.

“ధరణీరేణువుల నయిన గణుతింప నలవి యగుం గాని యమ్మహాత్ముని లీలావతారాద్భుత కర్మంబులు లెక్కపెట్ట నెవ్వరికి నశక్యం బై యుండు”. (–భాగ–2–199)

విష్ణుడు దాల్చిన అవతారాలనే పురాణాలలో ప్రశస్తంగా పేర్కొన్నారు. శివునికి అవతారాలు లేవా? అని కొందరు ప్రశ్నిస్తారు. శివావతారాలు గూడా కొన్ని శివపురాణాదులలో ప్రస్తావించబడి వున్నాయి. కాని లయ కర్త అయిన శివునికంటే పోషణకర్త అయిన విష్ణుదేవునికి జగద్రక్షణ బాధ్యత



ఎక్కువ కాబట్టి ఆ స్వామి అవతారాలే పురాణ ప్రసిద్ధా లయ్యాయని భావించవచ్చు.

ధర్మాధర్మాలతో ముడివడిన భగవంతుని అవతారాలను అన్నమాచార్యులవారు ఇలా చమత్కారంగా పేర్కొన్నారు.

**అదరి ధర్మము సెడి– అధర్మమైనా మేలు**<br>
**వెదగు మునులు విన్న – వింతురు నీకు,**<br>
**తడవి ధర్మము నిల్ప – ధరణి బుట్టుదు వీవు**<br>
**బడి నిన్ను సేవించి – బ్రదుకుదు మపుడే (2–161)**

ఐశ్వర్యం, ధర్మం, కీర్తి, సౌందర్యం, జ్ఞానం, వైరాగ్యం మున్నగు గుణాలను అవతారాలు సువ్యక్తంగా ప్రదర్శిస్తాయి.

కృతయుగంలో మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామనావతారాలు ఐదు ఆవిర్భవించాయి. త్రేతాయుగంలో పరశురామ, శ్రీరామావతారాలు వచ్చాయి. ద్వాపరంలో బలరామ కృష్ణావతారాలు సంభవించాయి. కలిలో బుద్ధ కల్క్యవతారాలలో ఒకటి ఆవిష్కృతం కాగా మరొకటి రానున్నదని పురాణ వాఙ్మయం తెలుపుతున్నది.

ధర్మం నాలుగు పాదాలపై నడిచే కృతయుగంలో ఐదుసార్లు భగవంతుడు అవతరించవలసిన అవసరం ఎందు కేర్పడిందని ప్రశ్నించేవా రున్నారు. బహుశః ఆ యుగంలో ధర్మానికి ఏ మాత్రం క్షతి కలగకుండా జాగరూకత వహించాలి కాబట్టి అన్ని సార్లు అవతరించ వలసి వచ్చిందేమో!

బుద్ధావతార విషయంలో అభిప్రాయ భేదాలున్నాయి. పురాణోక్తబుద్ధుడే బుద్ధుడని కొందరు, చారిత్రక బుద్ధుడే బుద్ధుడని మరి కొందరు, అభిప్రాయపడుతున్నారు. బలరామకృష్ణులను వేరువేరు అవతారాలుగా గ్రహించేవారు బుద్ధుణ్ణి ఒక అవతారంగా అంగీకరించరు.

అవతారాలలో పలు భేదాలున్నాయి. అంశావతారాలు, పూర్ణావతారాలు, కళావతారాలు, లీలావతారాలు, దివ్యావతారాలు, భౌమావతారాలు, అర్చావతారాలు, అంతర్యామ్యవతారాలు, విభవావతారాలు, కల్యాణ గుణావతారాలు ఇత్యాదులు.

## ఐదు స్వరూపాలు

పరస్వరూపం, వ్యూహస్వరూపం, విభవస్వరూపం, అంతర్యామి స్వరూపం, అర్చాస్వరూపం అని ఐదు ప్రకారాలుగా ఉన్న భగవానుని స్వరూపాలలో అర్చాస్వరూపం చివరిది.

1. శ్రీ వైకుంఠంలో నిత్యసూరులు, ముక్తపురుషులు తన్ను అనుభవిస్తుండగా శేషపర్యంకం పై శ్రీదేవితోనూ, భూదేవితోనూ కూడి ఉన్నది పరస్వరూపం.
2. సృష్టి స్థితి సంహారాలు చేయడానికీ, భక్తుల ననుగ్రహించడానికీ ఉన్ముఖమైనది వ్యూహస్వరూపం. ఇది విష్ణు-పురుష-సత్య- అచ్యుత- అనిరుద్ధరూపాలతో పంచవిధాలుగా ఉన్నదని వైఖానస ఆగమం పేర్కొంటున్నది.
3. దుష్టశిక్షణ, శిష్టరక్షణలకు అవతరించే రామకృష్ణాదులే విభవస్వరూపం.
4. జ్ఞానానికి మాత్రమే గోచరిస్తూ సర్వజీవుల హృదయకమల కోశంలో అంతర్నియంతగా ఉండేది అంతర్యామిస్వరూపం.
5. దేశకాలాది నియమాలు లేకుండా సర్వాన్నీ సహిస్తూ ఆశ్రితులకు సమ్మతమైన లోహశిలాది ద్రవ్యాలలో ఆవిర్భవించి ఆలయాలలోనో, గృహాలలోనో వెలుగొందేది అర్చాస్వరూపం.



## అర్చావతార విశిష్టత

"అర్చావతారస్సర్వేషాం బాంధవో బంధువత్సలః" అన్నట్లు అర్చారూపం అందరికీ బంధువై సౌశీల్యం, వాత్సల్యం, స్వామిత్వం మున్నగు గుణాలతో అలరారుతున్నది.

ఈ స్వరూపం స్వయంవ్యక్తమనీ, దివ్యమనీ, సైద్ధమనీ, మానుషమనీ నాలుగు విధాలుగా ఉంటున్నది.

తనకు తానుగా వ్యక్తమైన అర్చామూర్తిని స్వయంవ్యక్త మంటారు. దేవతలు ప్రతిష్ఠించిన మూర్తులు దివ్యాలు. యోగసిద్ధులైన మహాపురుషులు ప్రతిష్ఠించినవి సైద్ధాలు. మనుష్యులచే ఆగమోక్త విధానానుసారంగా ప్రతిష్ఠితములైనవి మానుషాలు. ఋషులు ప్రతిష్ఠించిన మూర్తులు పై విభాగాలలోనే అంతర్భవిస్తాయి.

## శ్రీ వేంకటేశ్వరుని అర్చావతారం

కలియుగంలో వేంకటాచలంపై నెలకొన్న శ్రీనివాసుని అర్చామూర్తి స్వయంవ్యక్తమని భక్తుల విశ్వాసం. అనుదినము లెక్కకు మిక్కిలిగా ప్రపంచం నలువైపులనుండీ ఈ మూర్తి భక్తుల నాకర్షిస్తున్నది.

**వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।**
**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి ॥**

అన్న పురాణోక్తి ప్రకారం వేంకటాద్రితో సమానమైన పవిత్ర స్థలం ఈ బ్రహ్మాండంలో మరొకటి లేదు. అట్లే వేంకటేశ్వరునితో సాటి రాగల దేవుడు కూడా ఇంతవరకూ లేదు, ఇంకముందు ఉండబోదని ఆ స్వామిని భక్తులు కీర్తిస్తున్నారు.

'అరాయి కాణే వికటే గిరిం గచ్ఛ సదాన్వే' అన్న ఋగ్వేద మంత్రం వేంకటగిరి ప్రశస్తిని చెబుతున్నదని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. 'జీవితంలో వికటపరిస్థితు లేర్పడినప్పుడు శ్రీనివాసుడు కొలువై వున్న వేంకటగిరికి వెళ్ళు' అన్న అర్థమందులో ఉన్నదని వారి అభిప్రాయం.

భవిష్యోత్తరపురాణంలోని–

**అరాయి కాణే వికటే గిరిం గచ్ఛేతి తం విదుః ।**
**ఏవం వేదమయః సాక్షాద్గిరీంద్రః పన్నగాచలః ॥**

అన్న శ్లోకం గూడా పై వివరణనే నిర్దేశిస్తున్నది.

ఆపద్బాంధవుడు, అనాథరక్షకుడు, ఏడుకొండలవాడు, కలియుగప్రత్యక్ష దైవం, వడ్డికాసులవాడు, పిలిస్తే పలికే దైవం అయిన శ్రీవేంకటేశ్వర స్వామి తిరుమలగిరులపై వెలసి అపారకృపతో ఆశ్రితజనులను రక్షిస్తున్నాడు.

ఈ స్వామి వికృతినామ సంవత్సరం అశ్వినీ నక్షత్రయుక్తమైన పాడ్యమి గురువారం అనే శుభదినాన ఆనందనిలయం ప్రవేశించాడు[1] .

కటిప్రదేశం పై వామహస్తముంచి తన్ను కొలిచే వారికి సంసారసాగరం మొలలోతే అని నిర్దేశిస్తున్నాడు. అట్లే దక్షిణ హస్తాన్ని దక్షిణ పాదంవైపు చూపుతూ తన పాదపద్మాలకు శరణాగతులైన వారికి మోక్షం కరతలామలక మని సూచిస్తున్నాడు.

1. చూడు – శ్రీవేంకటాచలమాహాత్మ్యం– 5–293

# ద్వితీయ ప్రకరణం

అట్టి శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యావతారానికి సంబంధించిన చరిత్రను పురాణాలు పేర్కొన్న పద్ధతిలో సంగ్రహంగా వివరించుకొందాం.

## నారదుని ప్రశ్న

అది నైమిశారణ్యం. అక్కడ శౌనకాదిమునులు సూతమహర్షి చెప్పే పురాణకథలు శ్రద్ధగా వింటున్నారు. సూతుడు ప్రసక్తానుప్రసక్తంగా వరాహపురాణకథను వివరించాడు. అందులో శ్రీవేంకటాచల ప్రస్తావన ప్రముఖంగా వచ్చింది.

కథ విన్న మునులు "వేంకటాద్రి ఏ యుగంలో ఈ భూతలంలో ప్రఖ్యాతమవుతుంది?" అని సూతుణ్ణి ప్రశ్నించారు. సూతుడు వారితో ఇలా అన్నాడు –

"మీ ప్రశ్నకు సమాధానంగా వేంకటాచల ప్రశస్తినీ, ఆ కొండమీద శ్రీవేంకటేశ్వర స్వామి నెలకొన్న వృత్తాంతాన్నీ విశదీకరిస్తాను వినండి" అని చెప్పనారంభించాడు.

బ్రహ్మమానస పుత్రుడైన నారదమునీంద్రుడు ఒకసారి భూలోకానికి వెళ్ళి అక్కడి గంగానదీ తీరం చేరాడు. కశ్యపుడు మొదలైన మహర్షులు అచట క్రతువులు నిర్వర్తిస్తున్నారు. వారు తగిన విధంగా ఆ దేవర్షిని పూజించారు. ఆయన రాక తమకెంతో ఆనందం కల్గించిందన్నారు.

అప్పుడు నారదమునీంద్రుడు "మహర్షులారా! మీరంతా ఎంతో శ్రద్ధతో ఈ పావన భూమిలో యజ్ఞాలు చేస్తున్నారు. ఈ యజ్ఞఫలాన్ని అర్హులైన వారికి సమర్పించాలి కదా! ఎవరి కర్పించాలన్న దృష్టితో మీరీ పని చేస్తున్నారో వివరించండి?" అని అడిగాడు.

అది విని భృగువు మొదలైన ముని ప్రవరులు యజ్ఞఫలభోక్త ఎవరో నిర్ణయించుకోలేక ఒకరి మొగం మరొకరు చూచుకొంటూ ఊరకుండి పోయారు.

అంతట నారదమహర్షి వీణతో అష్టాక్షరీమంత్రం పలికిస్తూ "మీరు మంచి క్రతువులాచరించి ప్రజాసంతతిని పెంచారు. అది మంచిదే కాని మోక్ష ప్రదాతయైన దేవుడు త్రిమూర్తులలో ఎవరో చక్కగా విచారించి నిర్ణయించుకోండి! ఆపైన ముక్తి నిచ్చే దేవునకు యజ్ఞఫలం సమర్పించండి" అని చెప్పి అటనుండి మహతి మీటుకొంటూ నిష్క్రమించాడు.

## త్రిమూర్తుల పరీక్ష

నారదుని మాటలు విన్న మునులు హరిహర బ్రహ్మలలో ఏ దేవుడు మోక్షప్రదుడో పరీక్షించి నిర్ణయించుకోవాలనుకున్నారు. ఆ పరీక్ష చేయడానికి మహర్షులలో అగ్రేసరుడయిన భృగువు తగినవాడని నిశ్చయించుకొన్నారు. సృష్టి-స్థితి-లయకర్తలైన త్రిమూర్తులలో మోక్ష మీగల మూర్తి ఎవడో పరీక్షించి తేల్చుకొని రమ్మని ఆ ముని ప్రవరుణ్ణి పంపారు.

అందు కంగీకరించిన భృగుమహర్షి ముందు సత్యలోకానికి వెళ్ళాడు. అక్కడ పద్మసంభవుడైన బ్రహ్మను దర్శించి సమస్కరించాడు. ఆ చతుర్ముఖుడు కూర్చోమని చెప్పక ముందే ఆసనంపై కూర్చున్నాడు. అందుకు బ్రహ్మదేవుడు కోపించి మునితో మాట్లాడకుండా మౌనం వహించాడు.

అంతట మహర్షి బ్రహ్మ రజోగుణస్వభావుడనీ, ఆయనకు మోక్షం ప్రసాదించే అర్హత లేదనీ నిర్ణయించుకొని "భూలోకంలో విధాతకు ఆలయం లేకుండుగాక"! అని శపించాడు. ఆపై అటనుండి నేరుగా కైలాసాద్రికి పయనించాడు.



భృగువు కైలాసం చేరే సరికి అక్కడ శివుడు పార్వతితో క్రీడిస్తున్నాడు. మునిని చూచి పార్వతి సిగ్గుపడింది. 'ఏకాంతంలో దంపతులున్నప్పుడు ఇలా రావచ్చునా?' అని ఆగ్రహించి శంకరుడు మౌనం వహించాడు.

భృగువు శివుని వాలకం గమనించి ఇతడు తమోగుణ ప్రధానుడు, ముక్తిప్రదాత కాజాలడు' అని నిశ్చయించుకొన్నాడు. 'ఈయనకు లింగపూజయే కాని అంగపూజ లేకుండుగాక!' అని శపించాడు.

అక్కడినుండి వైకుంఠం చేరిన భృగు మునీంద్రుడు శ్రీనివాసుడు రమాసమేతుడై శేషతల్పంపై శయనించి ఉండగా చూచాడు. వెంటనే ఏ మాత్రం ముందు వెనుక లాలోచించక ఆ దేవుని వక్షఃస్థలంపై తన్నాడు. శ్రీహరి వెన్వెంటనే లేచి మునిని శాస్త్రోక్త విధిననుసరించి అర్చించాడు. తన్ను తన్నిన ముని పాదాన్ని తొడపై నుంచుకొని ఒత్తుతూ చిరునవ్వు నవ్వి ఇలా అన్నాడు.

"మునీంద్రా' మీరాక గమనించక శయనించి ఉండినాను. ఈ అపచారం సహించి నన్ను కరుణించండి. కఠినమైన నావక్షఃస్థలం తాకిన మీపాదం ఎంత నొచ్చిందో! చిగురుటాకువంటి మీ పాదం వల్ల నాకే మాత్రం నొప్పి కలుగలేదు" అంటూ మునిని అనునయించాడు.

ఆ మాటకు భృగువు ఎంతో సంతోషించాడు. తన తప్పిదం గ్రహించి సిగ్గుపడ్డాడు. తలవంచుకొని "దేవా! నీవు శాశ్వత సత్త్వమూర్తివి. మహోన్నతుడవు" అని శ్రీహరిని వినుతించాడు. మోక్షప్రదాత శ్రీనివాసు డొక్కడే అని నిర్ణయించుకొన్నాడు.

ఆపై భృగుమహర్షి గంగాతీరం చేరి కశ్యపాదులను చూచి "శ్రీహరి ఒక్కడే శుద్ధ సత్త్వ స్వరూపుడు. మోక్ష ప్రదానార్హత ఆ దేవదేవుని కొక్కనికే

ఉన్నది అని ప్రకటించాడు. అందుకు అంగీకరించిన మునులు యజ్ఞఫలాలు విష్ణుదేవునికి సమర్పించి విష్ణుధ్యానపరాయణులయ్యారు.

## వైకుంఠం వీడిన లక్ష్మీదేవి

భృగువు విష్ణు వక్షఃస్థలాన్ని తన్నినప్పుడు లక్ష్మీదేవి ఆ దేవుని ఉరః ప్రదేశంలోనే ఉండినది. ఆ దేవికి భృగునిపై మితిమీరిన కోపం వచ్చింది. ఆమె విష్ణువుతో "పరమపురుషుడవైన నీ వక్షఃస్థలంపై నే నున్నాను. ఒక పరపురుషుడు వచ్చి నిన్ను తన్నాడు. నీవందుకు సంతసించావు కాని నాకు అతనిపై ఆగ్రహం కల్గింది. నేను మునినేమైనా అంటే నీకది సమ్మతం కాదు. కనుక నేను ఇక ఇక్కడ ఉండను. తపస్సు చేయడానికి వెళ్తున్నాను. నీ పదధ్యానం చేస్తూ తపమాచరించే జ్ఞానం నాకు ప్రసాదించు" అని పల్కింది.

అలా పల్కి అటనుండి నిష్క్రమించి ఎటకో వెడలిపోనున్న లక్ష్మిని విష్ణుభగవానుడు అనేకవిధాల అనునయించడానికి యత్నించాడు. కాని ఆమె శాంతించలేదు. ఆమెనట నుండి పోనీకుండా ఉంచడానికి రమాపతి చేసిన ప్రయత్నం విఫలమయింది. ఆయన మౌనం వహించాడు.

లక్ష్మీదేవి వైకుంఠం వీడి భూలోకంలోని కొల్లాపురం చేరింది. అక్కడి ప్రజలామెను భక్తితో ఆదరించి అర్చించారు. ఇలా లక్ష్మీనారాయణుల నడుమ కల్గిన ప్రణయ కలహం లక్ష్మీనివాసాన్ని వైకుంఠం నుండి కొల్లాపురానికి మార్చింది".

సూతుని కథనం విని శౌనకముని ఇలా అన్నాడు.

"శ్రీమన్నారాయణుడు లక్ష్మి తనకు దూరమైనప్పుడు భూదేవిపైనా, నీళాదేవిపైనా మోహం నిలిపి వైకుంఠంలో పూర్వం లాగా ఆనందంతో ఉండిపోయాడా? లేక లక్ష్మి కొరకే చింతిస్తూ దైన్యం చెందాడా?"



అది విని సూతుడు ఈ రీతిగా అన్నాడు. "విష్ణుభగవానుడు లక్ష్మి ఎడబాటు సహింప లేకపోయాడు. వియోగతాపపీడితుడై ఇలా చింతించాడు.

"ఔరా! నిత్యానపాయిని అయిన రమతో నాకెడబాటు సంభవించింది. కర్మగతి నెవరూ దాటలేరుగదా! లక్ష్మి ఎక్కడ ఉన్నా ఆమె నా హృదయంలోనే విలసిల్లుతూ ఉంటుంది. నన్ను వీడి వెళ్ళజాలదు. నేను ఆమె హృదయమందే ఉండి ఆమెను నాహృదయంలో నిల్పుకొని జగద్రక్షణ నిర్వహిస్తాను. ఐనా లోకమర్యాద ననుసరించి ఆమెను నేనిప్పుడన్వేషించక తప్పదు. లేకుంటే నన్ను దయలేనివాడని లోకులు నిందిస్తారు".

## వేంకటాచలం చేరిన విష్ణువు

ఈ రీతిగా తలంచి శ్రీహరి వైకుంఠపుర రక్షణ బాధ్యత తన పార్షదులకు అప్పగించాడు. భూదేవినీ, నీళాదేవినీ వారి రక్షణలో వుంచాడు. లక్ష్మి నన్వేషించి ఎక్కడ ఉన్నా తీసుకువస్తానని వారితో చెప్పి వైకుంఠం వీడి భూలోకంలోని వేంకటగిరి చేరుకొన్నాడు.

ఆ కొండమీద వరాహస్వామికీ, పుష్కరిణికీ దక్షిణదిశలో ఉన్న చింతచెట్టు క్రిందికి వెళ్ళాడు. ఆ చెట్టు మొదట నున్న పుట్టలో ప్రవేశించాడు. అక్కడ పదివేలసంవత్సరాలు ఎవరికీ కనిపించకుండా ఉండిపోయాడు.

అంతట భూలోకంలో ఇరువదెనిమిదవ ద్వాపరం గతించి కలి ప్రవేశించింది. ధర్మాత్ముడైన చోళరాజు ధర్మబద్ధంగా భూపరిపాలన చేస్తున్నాడు.

## బ్రహ్మరుద్రుల గోవత్సరూపాలు

వైకుంఠం వీడి కొల్లాపురం చేరిన లక్ష్మి శ్రీహరి తన్ను అన్వేషిస్తూ వచ్చి వేంకటాద్రిపై నున్న తింత్రిణీ వృక్షమూలంలో ఉన్న పుట్టలో ఉన్నాడని గ్రహించింది. ఆయన క్షేమాన్ని గూర్చి చింతించింది. ఐనా తన పంతం

వీడరాదని నిశ్చయించుకొన్నది. ఏకాకిగా నున్న పతిపై జాలి వహించి గొల్లెత రూపంలో ఒంటరిగా వెడలి చోళరాజనగరి చేరింది. అక్కడ చోళరాజు ధర్మపత్ని నివసించే మణిమందిరం సమీపించింది.

ఇంతలో లక్ష్మీదేవి శ్రీహరికై చింతిస్తూ ఉన్నదన్న సంగతి గ్రహించిన బ్రహ్మ గోరూపంతోనూ, రుద్రుడు వత్సరూపంతోనూ లక్ష్మి చెంతకు వచ్చారు. గోవత్సరూపాలతో వచ్చిన వారిరువురినీ ఆదరించి రమాదేవి 'ఆ దూడనూ, ఆవునూ అమ్ముతాను' అని ప్రకటిస్తూ అక్కడ తిరుగాడింది.

ఆమె మాటలు విని రాజు భార్య తనబిడ్డకు గోక్షీర మవసరమని తలచి ఆ గోవత్సాలను తగిన మూల్యం చెల్లించి విలుచుకొనింది. వల్మీకంలో ఉన్న శ్రీహరి పోషణకై ఆ గోవత్సాలు ఉపకరించగలవని విశ్వసించి లక్ష్మి నిశ్చింతగా కొల్లాపురం చేరింది.

చోళనరపతి ఆవుల మందలో ఒకటిగా ఉన్న బ్రహ్మ అనుదినమూ తక్కిన గోవులతో పాటు వేంకట శైలానికి పోయి పుట్టలో నున్న మాధవునికి పాలు సమర్పించ సాగాడు. మహావిష్ణువు బ్రహ్మరుద్రులను మెచ్చుకొన్నాడు. నిత్యమూ గోరూప బ్రహ్మ యిచ్చిన క్షీరంతో తన ఆకలి తీర్చుకొన్నాడు.

## పాలు లేని గోవు

చోళరాజు భార్య తన పుత్రునికి పాలు కావాలని ఆ గోవును రప్పించి పొదుగునుండి పాలు పిండ బోయింది. కాని అందులో పాలు లేవు. "ఏమిది? పొదుగేమో కుండలాగా ఉన్నది? అందులో చుక్క పాలు గూడా లేవు. ఇందుకు కారణమేమి?" అని ఆమె ఆశ్చర్యచకితురాలయింది.

వెంటనే గోపాలకుణ్ణి పిలిచి ఆవును చూపి "పాలెందుకు లేవు. నీవే త్రాగుతున్నావా?" అని గద్దించింది. "అమ్మా! నేను ఏ పాపమూ ఎరుగను.



పాలు నేను త్రాగలేదు. దూడ పూర్తిగా త్రాగిందేమో!" అన్నాడు వాడు. "దూడ ఇంటియందే ఉన్నది కదా! అది ఎలా త్రాగగలదు?" అని రాణి మందలించి గోపాలకుణ్ణి కట్టివేసి కొట్టించి పంపివేసింది.

## గోపాలుని మృతి

ఆ గొల్లవాడు ఏడుస్తూ మరునాడు ఆ గోవు వెంటనే నడచి దాని సంగతి గమనించాడు. అది శేషాద్రిమీది పుట్టలో పాలు దిగజార్చడం చూచాడు. ఆగ్రహించి గొడ్డలి ఎత్తి గోవునడినెత్తిపై కొట్టబోయాడు.

ఇంతలో గోవును రక్షించాలని పుట్ట నుండి వెలికివచ్చిన గోవిందుడు ఆవు తలకు తన తలను ఒడ్డాడు. గొల్లని గొడ్డలి దెబ్బ స్వామి తలపై బడింది. నెత్తురు ఏడు తాటిచెట్లంత ఎత్తుగా పైకెగసి క్రిందికి పడింది. అది చూచి గొల్లవాడు భయంతో నేలవ్రాలి ప్రాణాలు వదిలాడు.

గోవు కొండ దిగి నేరుగా చోళరాజు కొలువుకు పోయింది. అక్కడ నేలపై బడి పొరలాడింది, అరచి కన్నీరు గార్చింది. ఆపై ధేనువక్కడినుండి పోతుండగా రాజు దానివెంట చారులను పంపాడు. ఆవు వేంకటాద్రికి చేరి పుట్ట వద్ద నిలిచింది. పుట్టనుండి రక్తం చిమ్మిన దృశ్యం చూచి చారులు భీతి చెందారు. చోళరాజు వద్దకు పరుగిడి వచ్చి వృత్తాంతం అంతా విన్నవించారు.

రాజు దిగ్గన లేచి సపరివారంగా వేంకటాద్రికి వచ్చాడు. అక్కడ జరిగిన సంఘటన తిలకించి భయపడ్డాడు. రక్త ప్రసరణకూ, గొల్లని మృతికీ, గోవు పరితాపానికీ కారణమేమై యుండవచ్చునని మంత్రుల నడిగాడు.

## చోళరాజుకు శాపం

ఇంతలో వల్మీకం నుండి రక్త సిక్తాంగుడైన శ్రీనివాసుడు శంఖచక్రాలు చేపట్టి పైకి వచ్చి రాజును చూచి ఈ రీతిగా అన్నాడు. "ఓరీ! పాపాత్మా!

నేను పుట్టలో దాగి యుండగా ఈ గోపాలు డిక్కడికి వచ్చి నాకు నిత్యం పాలిచ్చే గోవును కోట్టబోయి నన్ను గాయపరిచాడు. ఆ పాపంతోనే అతడు మరణించాడు. నేను పరదేశిని. నాకెవరూ రక్షకులు లేరు. ఈ పుట్టలో ఉంటూ కాలం గడపుతున్నాను. తల్లి లాగా వచ్చి నీధర్మధేనువు పాలిచ్చి నన్ను కాపాడింది. దీనిని చంపబూనిన గొల్లవాడు ఆ పాపానికి ఫలం అనుభవించాడు. వాడు నీవాడు. నన్ను కొట్టిన పాపానికి ఫలం నీవూ అనుభవించాలి. నీచ స్థితిపొంది పిశాచివై పోదువు గాక!"

అది విని రాజు మూర్ఛిల్లి భూమిపై బడిపోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లి లేచి శ్రీవేంకటేశ్వరునికి సాష్టాంగ నమస్కారం చేశాడు. దీనాతి దీనుడై ఇలా మొరపెట్టుకొన్నాడు.

"దేవా! నేను తెలిసి ఈ పాపం చేయలేదు. నాపై ఆగ్రహించి దారుణంగా నన్ను శపించావు. నీ పాదాలపైబడి వేడుకొంటున్నాను. నన్ను కరుణించి ఈ శాపం తొలగే దారి చెప్పు".

అందుకు శ్రీనివాసుడు "రాజా! నాశాపం వ్యర్థం కాదు. కలియుగ మున్నంత కాలం నీవీ శాపం అనుభవించక తప్పదు. ఆకాశరాజనే భూపతి తన పుత్రిక పద్మావతిని నాకిచ్చి పెండ్లిచేసే సమయం వస్తుంది. అప్పుడు ఆ రాజు నాతలపై కిరీటం నిలుపుతాడు. నేను ప్రతిశుక్రవారం ఆ కిరీటాన్ని శిరస్సుపై ధరిస్తాను. ఆ సమయంలో నీవు సుఖిస్తావు".

అలా శాపగ్రస్తుడైన చోళరాజు అటనుండి నిష్క్రమించాడు.

శ్రీనివాసుడు మరల పుట్టలో ప్రవేశించాడు. తలనొప్పి భరించలేక బృహస్పతిని స్మరించాడు. దేవ గురువు రాగానే అతనికి జరిగిన వృత్తాంతం తెలియపరచాడు.



"కాలకర్మలు, గ్రహగతులవల్ల ఈ దుర్ఘటన జరిగింది. దీనికి తగిన మందు తెప్పించు" అని కోరాడు.

అందుకు బృహస్పతి "దేవా! నీకు గూడ కాలకర్మలు, గ్రహగతులు ఉన్నాయా? మంచి మందు తెప్పించమన్నావు. అత్తి(మేడి)పాలలో జిల్లేడు పత్తిని అద్ది గాయంపై పెట్టితే నొప్పి తగ్గిపోతుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

## చింతచెట్టు-పుట్ట

ఇది విని శౌనకుడు "సూతా! ఆ చింతచెట్టు, ఆ పుట్టకు సంబంధించిన విశేషాలు వివరించు" అని ప్రశ్నించాడు. అందుకు సూతుడు చెప్పిన సమాధాన మిది.

"త్రేతాయుగంలో కౌసల్యా దశరథులు అంత్యకాలంలో శ్రీరాముని మీది వ్యామోహాతిశయం వీడకుండానే దేహం చాలించారు. ఆ ఋణాను బంధం వల్ల బ్రహ్మదేవుడు శ్రీనివాసునకు ఆశ్రయంగా ఉండడానికై దశరథుని తేజస్సును తింత్రిణీ వృక్షంగా సృష్టించాడు. కౌసల్యాతేజాన్ని పుట్టగా రూపొందించాడు.

దేవకీ వసుదేవులు గూడా శ్రీ కృష్ణునిమీది పుత్రవ్యామోహంతోనే దేహత్యాగం చేశారు. అందుకే వసుదేవుని తేజం చింతచెట్టు గానూ, దేవకీ తేజం వల్మీకంగానూ బ్రహ్మ నిర్దేశాన్ననుసరించి రూపొందాయి. అందువల్లనే శ్రీనివాసుడు ఆ పుట్టలో పదివేల వత్సరాలు ఉండగలిగాడు.

దీనినిబట్టి దశరథుడే చింతచెట్టు, కౌసల్య పుట్ట, లక్ష్మణుడే శేషాచలం. అయోధ్యయే ఆ కొండమీది అరణ్యం. సరయూ నదియే స్వామి పుష్కరిణి. శ్రీరాముడే శ్రీనివాసుడు.

తదనంతరకాలంలో వసుదేవుడే చింత చెట్టు, దేవకీ దేవియే పుట్ట, బలరాముడే శేషాద్రి. మధురానగరమే వేంకటనగరం, యమునయే పుష్కరిణి, శ్రీకృష్ణుడే లీలా మానుష విగ్రహుడైన శ్రీనివాసుడు" అని చెప్పాడు.

అది విని శౌనకాది మునులు ఆశ్చర్యానికి లోనయ్యారు. తదనంతర వృత్తాంతాన్ని రౌమహర్షణి ఇలా వివరించాడు.

## వరాహస్వామితో కలయిక

"బృహస్పతి నిర్దేశించిన విధంగా గాయంపై పెట్టడానికి మందు నన్వేషిస్తూ ఒకనాటి ప్రాతఃకాలంలో శ్రీనివాసుడు అడవిలో అటూ ఇటూ తిరుగసాగాడు. అప్పుడు శ్రీ వరాహస్వామి నరునిరూపంలో ఉన్న నారాయణుని చూచాడు. అతడొక రక్కసుడేమో! అని భ్రమించి ఘుర్ఘు రారావం చేశాడు. అంతట శ్రీనివాసు డొకపొదలో దాగుకొన్నాడు. వరాహస్వామి ఆయన వెంటబడి పొదలో దూరాడు. శ్రీనివాసుడొక వంక ఒదిగి నిలబడ్డాడు.

ఇంతలో వరాహస్వామి ఆ నరుడు నారాయణుడే అని గ్రహించాడు. ఆయన చెంతకు వెళ్ళాడు. శ్రీనివాసుణ్ణి ఇలా ప్రశ్నించాడు.

"వైకుంఠం వదలి ఇక్కడి కెందుకు వచ్చావు? ఉరఃస్థలంలో లక్ష్మి లేదే, కారణమేమి? మానవాకృతిలో ఎందుకున్నావు? తలపై గాయ మెందుకేర్పడింది?"

శ్రీనివాసుడు జరిగిన వృత్తాంత మంతా వరాహమూర్తికి విశదీకరించాడు. ఇలా వరాహశ్రీనివాసు లిరువురూ అడవిలో కలుసుకొన్నారు.

తదుపరి శ్రీనివాసుడు కలియుగాంతం వరకూ తాను నివసించడానికి తగిన చోటు చూపుమని వరాహమూర్తిని అర్థించాడు. మూల్యం చెల్లిస్తే చూపుతానని వరాహస్వామి అన్నాడు.



"నాచెంత ఇప్పుడు లక్ష్మి లేదు. ఆమె కొల్లాపురం చేరింది. నాకు రూక లెవరిస్తారు? ఈ ధరాతలమంతా నీ అధీనంలోనే ఉన్నది. అందులో కొంచెం నాకు కేటాయించు. నీ విచ్చిన చోటనే ఉంటాను. నరుని వలె నటించి నరుల నిచ్చటికి రప్పిస్తాను. నీకు నిత్యం పంచామృతస్నానం జరిపించే ఏర్పాటు చేస్తాను. భక్తులు ముందు నిన్ను దర్శించి నీకు కానుక లిచ్చేటట్లు నియమిస్తాను. నీకు నైవేద్య మందిన తరువాతనే నేను భుజిస్తాను" అని శ్రీనివాసుడన్నాడు.

అందుకు వరాహస్వామి సమ్మతించాడు. శేషాద్రిపై నిలవడానికి శ్రీహరికి స్థానమిచ్చాడు. అందుమీదట వరాహమూర్తి తనకు వంట చేస్తున్న వకుళమాలికను శ్రీహరికి సకలోపచారాలు చేయడానికి నియమించాడు. ఆమె శ్రీహరికి భోజనం పెడుతూ ఔషధం అందిస్తూ ఆయనను పోషించింది.

గోవత్సాలుగా మారి హరిని సేవించిన బ్రహ్మరుద్రులు తమ కర్తవ్యం నెరవేరగానే అంతర్ధానమై తమ స్థానం చేరుకొన్నారు.

శ్రీనివాసుడు వేంకటాద్రిమీద భక్తులకు సకలాభీష్టాలు ప్రసాదిస్తూ, రక్కసులకు భయం గొలుపుతూ, తల్లివద్ద బిడ్డలాగా వకుళమాలిక వద్ద ఉండిపోయాడు. తలమీది గాయం మానిపోగా లీలామానుష శరీరుడై వేంకటాద్రి మీద విహరించసాగాడు.

## వకుళమాలిక

అందుపై శౌనకాదులైన మునులు "వకుళమాత ఎవరు? ఆమె వృత్తాంత మేమి"? అని ప్రశ్నించారు. అందుకు సూతుడిలా బదులు పలికాడు.

"ద్వాపర యుగంలో యశోదాదేవి కృష్ణుణ్ణి అల్లారు ముద్దుగా పెంచింది. ఆమె కాలధర్మం చెందినప్పుడు ఋణానుబంధానుసారంగా విధాత ఆమెను వకుళమాలికగా జన్మింపజేశాడు. ఆమె భూవరాహస్వామి చెంత ఉండేది.

ఆమెను భూవరాహస్వామి శ్రీనివాసునికి అండగా నుండుమని నియమించాడు. తల్లిలాగా ఆమె శ్రీనివాసుణ్ణి ఆదరించింది. ఔషధం తెచ్చియిచ్చి ఆయన గాయం మాన్పింది. ఆ శ్రీనివాసుడే సౌందర్య రాశియైన ఒక రాజకన్యను వివాహమాడాడు". సూతుడా రీతిగా చెప్పగా విని ఔత్సుక్యంతో మునులు శ్రీనివాసుని పరిణయ వృత్తాంతం వివరించమన్నారు. సూతుడు తన కథనాన్ని కొనసాగించాడు.

## ఆకాశరాజు– తొండమానుడు

''ఇరువదెనిమిదవ ద్వాపరయుగాంతంలో ప్రారంభమయిన కలియుగంలో ఎందరో రాజులు భూవలయానికి పరిపాలకులయ్యారు. అందులో చంద్రవంశానికి చెందిన పాండవవంశంలో పుట్టిన సువీరుడనే రాజు రాజ్యం పాలించాడు. అతని కుమారుడు సుధర్ముడు. ఆ సుధర్ముని జ్యేష్ఠపుత్రుడే ఆకాశరాజు. ఆతని ధర్మపత్ని ధరణీదేవి.

ఒకనాడు సుధర్ముడు వేటాడటానికి అడవికి పోయాడు. అక్కడ ఒక మడుగులో ఒక నాగకన్యకను చూచి మోహించాడు. ఆమె "నేను నాగకన్యను. నీకూ నాకూ దాంపత్యం ఎలా పొసగుతుంది?'' అని ఆక్షేపించింది. కాని ఆమెపై నరపతికి వ్యామోహం సడలలేదు.

పిదప తన కులగోత్రాలను ఆ నాగ కన్యకకు తెలిపి తనకూ, ఆమెకూ జనించిన తనయుడికి అర్ధరాజ్యమిస్తానని మాటయిచ్చాడు. అప్పుడా నాగకన్యక అతణ్ణి పతిగా అంగీకరించింది. ఆమెకు జన్మించిన కుమారుని పేరు తొండమానుడు. ఈ రీతిగా ఆకాశరాజూ, తొండమానుడూ సోదరులయ్యారు.



## పద్మావతి ఆవిర్భావం

ఆకాశరాజుకు సంతానలోపం సంభవించింది. సంతాన ప్రాప్తికి ఉపాయమేమి అని అతడు బృహస్పతి నడిగాడు. దేవగురువు "నీవు విధి ననుసరించి పుత్రకామేష్టి ననుష్ఠిస్తే పుత్రోదయ మవుతుంది" అని పలికాడు.

రాజు అందుకంగీకరించి యజ్ఞభూమిని బంగారు నాగలితో దున్నించాడు. అలా దున్నే సమయంలో సహస్రదళపద్మ మొకటి ప్రత్యక్షమయింది. ఆశ్చర్యంతో పద్మంవైపు పరికించే సరికి అందులో ఒక తేజోవతి అయిన బాలిక కనిపించింది. అందరూ ఆ బిడ్డను ఆశ్చర్యంతో చూచారు. అప్పు డాకాశవాణి "రాజా! ఈ శిశువును చక్కగా పెంచు, నీకు మేలు గల్గుతుంది" అని చెప్పింది.

రాజు ఎంతో సంతోషంతో బిడ్డను తీసుకుపోయి ధరణీదేవి కిచ్చాడు. నగరంలో ఉత్సవాలు నిర్వహించాడు. అయోనిజ అయిన ఆ బిడ్డను రాజదంపతులు అల్లారు ముద్దుగా పెంచుకొన్నారు.

శుభప్రద అయిన ఆ కన్య లభించిన పిమ్మట ధరణీదేవి గర్భవతి అయింది. దశమమాసంలో సర్వలక్షణ సంపన్నుడైన కుమారుణ్ణి ప్రసవించింది.

రాజు సంతోషాతిశయంతో దానధర్మాదికాలు చేసి పుత్రికకు పద్మావతి అనీ, పుత్రునికి వసుదానుడనీ నామకరణం చేశాడు. ఆ బిడ్డ లిరువురూ దినదినప్రవర్ధమానులై పాలమున్నీటిలో ప్రభవించిన లక్ష్మీచంద్రుల వలె భాసించారు. కాలక్రమంలో వారు సకల విద్యలలో ఆరితేరారు.

పద్మావతికి యుక్త వయస్సు రాగానే ఈమెకు తగిన వరుడు లభిస్తాడా అని రాజు చింతకు లోనయ్యాడు. గురువు చెంత తన చింతను వ్యక్తం

చేశాడు. గురుడు ఆమెకు తగిన వరుడు తప్పక లభిస్తాడని చెప్పి రాజుకు ఊరట కలిగించాడు.

## పద్మావతి వనవిహారం

పద్మావతికి యౌవన మంకురించింది. వసంతకాలం గూడా సమీపించింది. వనాలన్నీ చిగుళ్ళతోనూ, పుష్పాలతోనూ నేత్రపర్వం చేశాయి.

పద్మావతి చెలికత్తెలతో గూడి ఒకరోజు ఉద్యానవనంలో పువ్వులు కోస్తూ విహరించింది. వనంలోని కమలాకరంలో జలక్రీడలాడింది. తదుపరి శృంగారవనంలో పుష్పశయ్యపై కూర్చున్నది.

అప్పుడు నారదముని అక్కడికి వచ్చాడు. పద్మావతి లేచి మౌనికి భక్తితో ప్రణమిల్లింది. నారదు డామె హస్తం పరీక్షించి "శ్రీమన్నారాయణుడు నీకు నాయకుడవుతాడు" అని చెప్పి అటనుండి వెళ్ళిపోయాడు.

## శ్రీనివాసుని వేట–పద్మావతీ దర్శనం

ఆ దినమే శ్రీనివాసుడు వేంకటాచలం నుండి వేటకు సిద్ధమై గుర్రం మీద పయనించాడు. అరణ్యాలలోనూ, పర్వతాలమీదనూ నిరాఘాటంగా సంచరించాడు. అప్పుడొక మదగజం ఆయన నెదిరించింది. శ్రీహరి దాన్ని సంహరించాలని వెంటబడ్డాడు. అది కొండ దిగి పరుగుదీసింది. అర్ధ యోజన దూరం పరుగిడి ఆ మదపుటేనుగు పద్మావతి ఉండే వనాన్ని సమీపించి ఘీంకరించింది.

ఆ ఘీంకార ధ్వని విని పద్మావతి చెలులు భీతి చెందారు. వారు పద్మావతిని రక్షించే ప్రయత్నంలో ఉండగా అక్కడికి శ్రీనివాసు డధిష్ఠించిన గుర్రం అరుదెంచింది. శ్రీనివాసుణ్ణి అక్కడి వనితలు బెదరు చూపులతో చూచారు.



ఏనుగు అంతకు మించి పరుగిడజాలక నిల్చి హరికి తొండం పై కెత్తి దండం పెట్టింది. శ్రీనివాసుడు జాలివహించి దానిని ప్రాణంతో విడిచి పుచ్చాడు.

శ్రీనివాసుడు పద్మావతినీ, ఆమె చెలికత్తెలనూ చూచి పొదల చాటున దాగాడు. ఏనుగు, గుర్రము, పురుషుడు కనిపించక పోయేసరికి ఆ కాంతలు తమలో తాము పలురకాల వితర్కాలు చేసుకొన్నారు.

పద్మావతి వారి పలుకులు విని నవ్వి వారితో చదరంగ మాడటాని కుపక్రమించిది. శ్రీనివాసుడు పొదలమాటుననే ఉండి ఆమెను వీక్షించాడు. ఆమె అందచందాలు ఆయన చిత్తాన్ని లోగొన్నాయి. మెల్లగా ఆమె చెంతకు వచ్చాడు. సాభిప్రాయంగా ఆమెపై చూపులు సారించాడు.

శ్రీనివాసుని వాలకం గమనించిన పద్మావతి చెలికత్తెలతో 'పరపురుషులు రాకుమార్తెలున్నచోటికి రాకూడదని చెప్పి అతణ్ణి దూరంగా పొమ్మని చెప్పండి' అని పలికింది. వారు అలాగే ఆయనను అక్కడనుండి వెంటనే వెళ్ళిపొమ్మన్నారు.

అప్పుడు శ్రీనివాసుడు "మీ రాకుమార్తెతో ఏకాంతంలో మాట్లాడాలని వచ్చాను. మీరే తొలగండి" అని అన్నాడు. అప్పుడు పద్మావతి అతని పుట్టు పూర్వోత్తరాలేమిటో తెలిసికొనండని చెలికత్తెలను ఆదేశించింది. వారు అతని కులగోత్రాలు, తల్లిదండ్రులు మున్నగు వివరాలను గురించి ప్రశ్నించారు.

"మాది చంద్రవంశం, వసిష్ఠగోత్రం, దేవకి తల్లి, వసుదేవుడు తండ్రి, బలరాముడు మా అన్న, సుభద్ర నాకు సోదరి" అని శ్రీనివాసుడు తన్ను గూర్చి వివరించాడు. ఆపై ఆ రాజకన్యకు సంబంధించిన కులగోత్రాదులను తెలియజేయ మన్నాడు.

"చంద్రవంశసంభవుడైన ఆకాశరాజు ఈమె తండ్రి, ఆయన అత్రిగోత్రోద్భవుడు" అని పలికారు. అప్పుడు శ్రీనివాసుడు వారితో "నేను ఈమె సఖ్యం కోరివచ్చాను. ఈ సంగతి ఆమెతో చెప్పి ఒప్పించండి!" అని అర్థించాడు.

అది విని పద్మావతి రోషించి "ఓ బోయడా! దూరంగా పొమ్ము" అని శ్రీనివాసుణ్ణి మందలించింది, కాని అత డటనుండి కదలకుండా ఉండడం గమనించి పద్మావతి అతనిపై రాళ్ళు రువ్వించింది. రాళ్ళ దెబ్బలకు గుర్రం నేలగూలింది. శ్రీనివాసుడు ఉత్తరాభిముఖుడై పరుగిడినాడు. కొండ జేరి తన వల్మీకంలో ప్రవేశించాడు.

## పద్మావతి పరితాపం

అక్కడ పద్మావతి చెలులతో గూడా యింటికి వెళ్ళి పుష్పశయ్యపై పరుండి చింతాక్రాంతురాలయింది. ఇక్కడ శ్రీనివాసుడు పద్మావతి యెడబాటుతో తపించిపోయాడు. వకుళమాలిక వచ్చి పలకరించబోతే పలకకుండా మౌనం వహించాడు. అతని శరీరంపై రాళ్ళ దెబ్బలు చూచి ఆమె భయపడింది. వెంటనే అందుకు తగిన చికిత్సలు చేసింది. ఏమి జరిగిందో చెప్పుమని బతిమాలింది.

తుదకు వకుళపై జాలిగొని శ్రీనివాసుడు జరిగిన సంగతి పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. పద్మావతి కులగోత్రాలు, తల్లిదండ్రులను గురించి కూడా వివరించాడు. తనకు ఆ కన్యపై కల్గిన మోహాతిశయాన్ని వ్యక్తం కావించాడు. ఎలాగైనా పద్మావతితో తనకు పరిణయం జరిగేటట్లు ప్రయత్నం చేయుమని వకుళమాలికను అర్థించాడు.



## వేదవతీ వృత్తాంతం

అంత వకుళమాలిక "నాయనా! అంత సౌందర్యరాశి అయిన కన్యక పద్మంలో పుట్టడానికి కారణమేమి" అని అడిగింది. అందుకాయన ఆమెతో ఇలా చెప్పాడు.

"తల్లీ! పూర్వం త్రేతాయుగంలో నేను దశరథ మహారాజుకు కొడుకునై జన్మించాను. జానకిని చేపట్టాను. తండ్రి ఆజ్ఞను శిరసావహించి వనవాసం చేశాను. రావణుడనే రాక్షసుడు సీతను అపహరించాడు. ఆమె రామా అంటూ విలపించింది.

ఆ విలాపం విని అగ్నిదేవుడు "రావణా! ఈమె సీత కాదు. రాముడు సీతను నావద్ద ఉంచి వెళ్ళాడు. ఒక విప్రవనితను సీతగా ఇక్కడ ఉంచాడు. నీ స్నేహం కోరి నీకు నేనీరహస్యం చెబుతున్నాను" అని చెప్పి సీతావేషంలో ఉన్న వేదవతిని రావణునికి చూపాడు. అసలు సీతను తనలోనే దాచుకొన్నాడు.

మూఢుడైన రావణుడు అగ్ని మాటలు నమ్మాడు. సీతను వదలి వేదవతిని తీసుకుపోయాడు. లంకానగరంలోని అశోకవనికలో ఉన్నది ఆ వేదవతియే.

నేను సాగరం దాటి లంకజేరి రావణాదులను హతమార్చాను. అందరి మెప్పుగోరి "నీ వగ్నిలో ప్రవేశిస్తే గానీ నిన్ను పరిగ్రహించను" అని సీతతో (వేదవతితో) చెప్పాను. ఆమె అనలప్రవేశం కావించింది. అప్పుడు అగ్నిదేవుడు తనలో దాచిన అసలు సీతను నాకప్పగించి వేదవతిని తనలో దాచుకొన్నాడు.

అప్పుడు సీత నాకై తపించిన వేదవతిని పెండ్లాడుమని నన్ను కోరింది. నేనప్పుడు "ఈ జన్మలో ఏకపత్నీవ్రతుడను. మరు జన్మలో ఈమెను పత్నిగా చేపట్టగలను. అంతవరకూ వేదవతి బ్రహ్మలోకంలో ఉండాలి. నేను

వేంకటాద్రిపై అవతరించినప్పుడు ఈ వేదవతి భూతలంపై జన్మిస్తుంది. అప్పుడు నే నీమెను పరిగ్రహిస్తాను" అని చెప్పాను.

ఈ రహస్యం అగ్నిదేవునికీ నాకూ తప్ప మరెవరికీ తెలియదు. ఆపై ద్వాపరంలో నేను వసుదేవుని కుమారుడుగా జన్మించాను. అనంతరం ఈ వల్మీకంలో ఉదయించాను".

అది విని సంతసించిన వకుళమాలిక వేదవతి యొక్క పూర్వవృత్తాంత మెట్టిదో చెప్పుమని అడిగింది. శ్రీనివాసుడు ఈ క్రింది రీతిగా చెప్పాడు.

"వేదవతి పూర్వం ఒక విప్రకన్య. నన్ను పతిగా గ్రహింపగోరి తీవ్రతపస్సు అనుష్ఠించింది. రావణు డామెను కామించి బలాత్కరింప బోయాడు. "నేను నిన్ను శ్రీహరి చేత చంపిస్తాను" అని రావణునితో పలికి ఆమె అగ్నిలో ప్రవేశించింది. అనలు డామెను కాపాడినాడు.

రావణుడు సీత నపహరించడానికి వచ్చినప్పుడు వేదవతిని సీతగా మార్చి అగ్నిదేవుడు రావణుని కిచ్చాడు. సీతాదేవిని స్వాహాదేవి వద్ద ఉంచాడు. వేదవతి తాను ప్రతినవట్టినట్లే నాచేత రావణుణ్ణి హతుణ్ణి గావించి తన పంతం నెరవేర్చుకొన్నది. అగ్నిలో ఉన్న సీతను నా వద్దకు చేర్చడంలో కీలకమైన పాత్ర వహించింది. రావణ వధానంతరం బ్రహ్మలోకానికి పోయింది. అక్కడ కొంతకాలం తపస్సు చేసింది. పిదప పద్మంలో ప్రవేశించి పద్మావతిగా అవతరించింది."

ఇలా పద్మావతీ వృత్తాంతాన్ని శ్రీనివాసుడు వకుళమాలికకు వినిపించాడు. పద్మావతితో తనకు వివాహం జరిపించు మన్నాడు.

అంతట వకుళమాలిక "ఇప్పుడా పద్మావతి ఉన్న నగరమేది?" అని ప్రశ్నించింది. "ఈ వేంకటాద్రి దిగువనే ఆ నగరం అమరావతిలాగా



అలరారుతున్నది. దాన్ని 'నారాయణపుర' మంటారు. ఆకాశరాజు ఆ నగరాన్ని ధర్మబద్ధంగా పరిపాలిస్తున్నాడు. అతని తమ్ముడు తొండమానుడు, పుత్రుడు వసుదానుడు, ధరణీదేవి భార్య, కుమార్తె పద్మావతి' అని ఆకాశరాజు వైభవాన్నీ, నారాయణ పుర ప్రశస్తినీ వివరించాడు. నారాయణపురం చేరే మార్గాన్ని కూడా నివేదించాడు. నారాయణపురానికి వెళ్ళి తనకు పద్మావతి అనుకూల పడేటట్లు తగిన ప్రయత్నం చేయుమన్నాడు.

ఆ మీదట వకుళ "నీ వృత్తాంతం వారడిగితే ఏమని చెప్పేది" అని ప్రశ్నించింది.

"అమ్మా! చంద్రవంశజులైన దేవకీ వసుదేవులు నా తల్లిదండ్రులని చెప్పు. బలరాముడన్న అనీ, సుభద్ర సోదరి అనీ, నాది వసిష్ఠగోత్రమనీ వారికెరిగించు. నా నక్షత్రం శ్రవణం అనీ, యౌవనం, అందచందాలు గల నేను పద్మావతి కన్నిరీతులా తగిన వరుడనని తెలియ జెప్పు" అని శ్రీనివాసుడన్నాడు.

## వకుళమాత నారాయణపురగమనం

వకుళ సంతోషంతో దేవమాయా నిర్మితమైన అశ్వమునధిష్ఠించి కొండ దిగింది. అక్కడి పుణ్యతీర్థంలో స్నానం చేసింది. కపిలేశ్వరస్వామికి ప్రణమిల్లింది. శుకయోగికీ, అగస్త్య మునికీ మ్రొక్కింది. నారాయణ పురం చేరి అగస్త్యుడు నిర్మించిన అక్కడి ఆలయంలోని శివునికి నమస్కరించింది.

ఆ దేవాలయంలో ఉన్న కన్యకలలో ఒకతెను పిలిచి "అమ్మా! నీవెవ్వరిదానవు?" అని ప్రశ్నించింది. ఆ కన్యక "నేను ఆకాశరాజు పుత్రిక పద్మావతికి చెలికత్తెను" అని చెప్పింది.

"నిన్ను చూస్తే ఏదో విచారంలో ఉన్నట్లు ఉన్నావు. నీముఖం ఎందుకలా చిన్నవోయింది" అని వకుళ మళ్ళీ ఆ అమ్మాయి నడిగింది. అందు కాకన్య ఇలా బదులు పలికింది.

"అమ్మా! ఏమని చెప్పేది? నిన్న పద్మావతితో గూడి చెలికత్తెల మందరమూ వనవిహారానికి వెళ్ళాము. అక్కడి కొక శబర కుమారుడు వచ్చాడు. అతడు మిక్కిలి అందగాడు. అతడు గుర్రం మీద వచ్చి మా రాజకన్యతో ఏమేమో మాటలు చెప్పబూనాడు. రాజకన్య అతనిపై కోపించి రాళ్ళు రువ్వించింది. రాళ్ళ దెబ్బలకు గుర్రం నేలగూలింది. అతడుత్తరాభిముఖుడై పారిపోయాడు.

తదుపరి పద్మావతి తన మందిరం చేరింది. ఆ కిరాతుని దృష్టి ఆమెపై సోకిందో ఏమో! ఆమెకు గొప్ప తాపజ్వరం కల్గింది. ఆమె తల్లి దండ్రులు చింతాక్రాంతులయ్యారు. దేవగురువగు బృహస్పతిని ఆహ్వానించి ఆమెను చూపారు. ఆమె తాపం తీరేటట్లు మందిమ్మన్నారు.

"రాజా! ఈమెకు ప్రాణభయం లేదు. మీరు చింతించ వద్దు. ఇప్పుడే రుద్రాభిషేకం చేయించండి! అంతా కుదుటబడుతుంది" అని బృహస్పతి చెప్పాడు.

రాజు రుద్రాభిషేకానికి అవసరమైన ఏర్పాట్లు చేశాడు. అందుకు తగిన విప్రుల నీగుడికి పంపాడు. మాచేత ఫలపుష్పాదికాలు ఇక్కడికి చేర్పించాడు అని చెప్పి "ఇంతకూ నీవెవరు? ఇక్కడి కే పని మీద వచ్చావు?" అని వకుళను ప్రశ్నించింది.

"లతాంగీ! విను, నేను శ్రీవేంకటేశ్వరుని దాసిని. ఒకపని మీద ఉదయమే బయలుదేరివచ్చాను. ఈ నగరంలో అంతఃపురానికి వెళ్ళి ధరణీదేవి కొక ఆప్తవాక్యం చెప్పాలి" అని వకుళ సమాధానం చెప్పింది.



ఆ చెలికత్తె "రుద్రాభిషేకం పూర్తి అయ్యేంత వరకూ ఇక్కడే ఉండు. తరువాత నేనే నిన్ను అక్కడికి తీసుకుపోతాను" అని చెప్పింది. అందుకు సమ్మతించి వకుళ అక్కడే నిలబడింది.

అక్కడ శ్రీనివాసుడు ధీరుడై ఉండి కూడా పద్మావతీ విరహబాధితుడై చింతకు లోనయ్యాడు.

# తృతీయ ప్రకరణం

## ఎఱుకతగా శ్రీనివాసుడు

వకుళమాలిక వేంకటాచలం దిగిపోయిన పిదప శ్రీనివాసునికి పద్మావతిని చూడాలన్న కోరిక ఇనుమడించింది. ఎట్లైనా ఆమె చెంతకు చేరాలనుకున్నాడు. తన దివ్యరూపాన్ని మరుగుపరచి జీర్ణవస్త్రాలు ధరించి ఎఱుక జెప్పుతూ ఊళ్ళు దిరిగే ఎఱుకలసాని రూపం దాల్చాడు. వృద్ధ వనిత లాగా వంగుతూ లేస్తూ నడక సాగించాడు. బ్రహ్మను ఏడునెలల బాలుడుగా వీపున అంటగట్టుకొన్నాడు. ఒక బెత్తం చేతబట్టుకొన్నాడు. ఒక బుట్ట నెత్తిపై బెట్టుకొని నారాయణపురానికి వెళ్ళాడు. ఆ నగరంలోని వీథులలో అమ్మలక్కలను చూచి 'ఎఱుకోయమ్మ, ఎఱుక' అంటూ తిరిగాడు.

కొందరామె చెంతజేరి గద్దె జెప్పు మన్నారు. ఇంతలో రాణి చెలులు వచ్చి నీ ఎఱుక ఎట్టిదో ఎఱుకపరచమన్నారు. "నా ఎఱుక జనులందరికీ శుభం చేకూర్చే ఎఱుక. నిజమెఱుగ జాలిన వారికే ఎఱుక చెబుతాను గాని అడిగినవారి కందరికీ చెప్పను" అని ఎఱుకలసాని పలికింది.

ఆ చెలులు ధరణీదేవి వద్దకు పోయి ఎఱుకలసాని సంగతి ఎఱిగించారు. ఆమెను తీసుకు రమ్మని రాణి వారిని పంపింది. వారు పోయి ఎఱుకలసానిని అంతఃపురానికి రమ్మని ఆహ్వానించారు. ఆమె వారి ననుసరించి ధరణీదేవి చెంతకు చేరింది.

రాణి ఎఱుకతకు తగిన మర్యాదలు చేసింది. "మీ ఊరేది? నీ పేరేమి? నీ ఇల్లెక్కడ?" అని ధరణీదేవి ఆమెను నడిగింది.

"అమ్మా! మావంటి వారి కిళ్ళూ, వాకిళ్ళూ అంటూ ఉంటాయా? దేశాలన్నీ తిరిగే వారికి ఒక ఊరితో పనేమి? ఈ యూరి ప్రజలకు ఎఱుక చెప్పాలని ఇక్కడికి వచ్చాను" అని ఎఱుకలసాని బదులు పలికింది?



## ఎఱుకత గద్దె

అపై ఎఱుకత కోరిక మేరకు ముంతెడు ముత్యాలు దానికిచ్చి రాణి గద్దె చెప్పుమనింది. పలు దేవతలను స్మరించి ఎఱుకల సాని ఇలా చెప్పింది.

"అవ్వా! నీ తలపు మేలౌతుంది. నీ ఆడుబిడ్డను గురించి నీవు అడుగుతున్నావు. నీ బిడ్డ పూదోటలో ఒక నల్లనయ్యను చూచి అతణ్ణి మోహించింది. ఆ నల్లనయ్య పడగలతో మెరిసే బంగారు కొండపై ఉన్నాడు. వాడు నరుడు కాడు, శ్రీమన్నారాయణుడే. వాడికి నీ బిడ్డపైనా, నీ బిడ్డకు వాడిపైనా తలపు కలిగింది. వాడి కిచ్చి పెండ్లి చేస్తే నీ బిడ్డ సుఖంగా వుంటుంది.

ఇంక కొంతసేపటికి వేంకటేశ్వరుడు పంపిన ఒక వనిత పెండ్లి రాయబారం సాగించడానికి ఇక్కడికి వస్తుంది. నామాటలు కల్ల గాదు. ఇది ముమ్మాటికీ నిజం".

ఇలా చెప్పి ఎఱుకత దిగ్గన లేచి వెళ్ళింది. శ్రీనివాసరూపంతో వేంకటాద్రి చేరింది.

ఎఱుకల సాని మాటలకు ధరణీదేవి ఆశ్చర్యపడి పద్మావతి వద్దకు పోయి "అమ్మా! ఎందుకిలా ఉన్నావు? నీ చింతకు కారణమేమి? ఎవరో ఒక సుందరాకారుణ్ణి చూచి మోహించినావట! ఇందువల్ల మనకు లోక నింద రాదా"? అని అడిగింది.

అందుకు పద్మావతి "అమ్మా! మీకు అపకీర్తి వస్తుందనే చింత వద్దు. నేను వలచినవాడు మనుజమాత్రుడు కాడు, పురుషోత్తముడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. నా చిత్తం ఆ దేవునిమీద నిలిచింది. ఇక జరగవలసిన దేదో జరిగి తీరుతుంది. మీరు చింతపడ వద్దు" అని చెప్పింది.

ఇంతలో రుద్రాభిషేకం పూర్తి చేసిన విప్రులు, పద్మావతి చెలులూ, వకుళమాలికా అక్కడికి వచ్చారు. విప్రులు రుద్రాభిషేక తీర్థం పద్మావతి పై ప్రోక్షించారు.

## ధరణీదేవితో వకుళ సంభాషించుట

ధరణీదేవి వకుళమాలికను యథోచితంగా ఆదరించింది. "ఎక్కడనుండి రాక? ఎవ్వరిదానవు నీవు? అని అడిగింది.

అంతట వకుళమాలిక "అమ్మా! నేను శేషాద్రినుండి వచ్చాను. శ్రీవేంకటేశ్వరస్వామికి దాసిని. ఆయన ఆనతి మీద పెండ్లి పెత్తనం చేయడానికి వచ్చాను. మీ పుత్రికను సకల సద్గుణ రాశియైన వేంకటేశ్వరుని కిచ్చి పెండ్లి చేయండి" అని పలికింది.

అందుకు ధరణీదేవి "అమ్మా మాధవుని చెంత రమాదేవి ఉన్నది కదా! ఇక మా అమ్మాయి నెందుకు కోరుతున్నారు?" అని ప్రశ్నించింది.

"అమ్మా! ఇప్పుడు లక్ష్మీదేవి శ్రీహరి వద్దలేదు. ఆమె కొల్లాపురం చేరి అక్కడి భక్తులననుగ్రహిస్తున్నది. అందుచేత మాధవుడు మీ కన్యను వలచినాడు. మీ రీవివాహాని కంగీకరించండి" అని వకుళమాలిక పలికింది. లక్ష్మి కొల్లాపురం చేరిన వివరాలు గూడా తెలియపరచింది. వేదవతీవృత్తాంతం గూడా వినిపించింది. రాణిద్వారా సంగతి గ్రహించిన ఆకాశరాజు సంతసించాడు. వకుళమాలిక పట్ల ఆదరాభిమానాలు చూపాడు. పద్మాక్షునికీ, పద్మావతికీ వివాహం జరపడానికి రాజు అంగీకరించాడు. ఈ సంగతి పద్మావతికి గూడా ఎరిగించి ఆమెను సంతసింపజేశాడు.

ఆ తరువాత రాజు బృహస్పతిని ధ్యానించగా ఆయన వచ్చి జరిగిన సంగతి గ్రహించి సంతోషించాడు. గురుని సూచన మేరకు రాజు ఊరికి



ఉత్తరాన ఐదు క్రోసుల దూరంలో వున్న శుకయోగిని పిలిపించాడు. గురుడు శుకునకు సంగతులన్నీ తెలియజెప్పగా పద్మావతీ శ్రీనివాసుల పరిణయానికి ఆ యోగివర్యుడు గూడ తన ఆమోదం వ్యక్తం చేశాడు.

## పద్మావతీ శ్రీనివాసుల పరిణయ శుభలేఖ

ఆపై శుకగురువు లిరువురూ వధూవరుల పొంతనాలు చూచారు. వివాహానికి తగిన లగ్నం నిర్ణయించారు. లగ్న పత్రిక గూడా సిద్ధమయింది. గురుని సూచన ననుసరించి శుకయోగి లగ్నపత్రిక తీసుకొని వేంకటాద్రికి వెళ్ళాడు. పత్రిక శ్రీనివాసుని కందించాడు. అది చదివి ఆనందించిన శ్రీనివాసుడు 'వైశాఖశుక్ల దశమీ శుక్రవారం నాటి రాత్రి జరుగనున్న శుభముహూర్తానికి బంధుమిత్రసమేతంగా రాగలము' అని తిరిగి సమాధానం వ్రాసి శుకుని చేతికందించాడు. శుకుడు నారాయణపురం చేరి ఆ లేఖను ఆకాశరాజు కందించాడు. రాజునుండి తగిన సత్కారం అందుకొని తన ఆశ్రమం చేరుకొన్నాడు. బృహస్పతి సైతం తిరిగి అమరావతీ నగరం చేరాడు. ధరణీదేవి వకుళకు దివ్యాంబరాలు, ఆభరణాలిచ్చి సత్కరించింది. వకుళ అటనుండి పయనమై శేషాద్రి చేరుకొని శ్రీనివాసునికి జరిగిన వృత్తాంతం తెలియపరచింది.

అంతట శ్రీనివాసుడు వకుళతో "పెండ్లిపెత్తనం బాగా నిర్వర్తించావు. నీ ప్రయత్నం విజయవంతమయింది. అయితే పెండ్లికి కావలసిన ద్రవ్యమెక్కడ నుండి తెస్తావు? ఇది బహువ్యయ ప్రయాసలతో కూడుకొన్న పని కదా!" అని అడిగాడు.

వకుళమాలిక 'లక్ష్మీదేవి నిక్కడకు పిలిపించితే కావలసినంత ధనం లభిస్తుంది గదా'? అని చెప్పింది. శ్రీనివాసునికా మాట నచ్చలేదు. 'నేనిక్కడ రెండవ పెండ్లికి సిద్ధమైయుండగా రమ నాకు ధనమిస్తుందా! ఆమెను ద్రవ్యమడగడం ఏ మంత సముచితం?' అని చింతించాడు.

ఆ మీదట పెండ్లి కవసరమైన ద్రవ్యం వరాహమూర్తి నడుగవచ్చు అని వకుళ చెప్పింది. అందుకు శ్రీనివాసుడు సమ్మతించాడు. ఆయన అనుమతితో వకుళ వరాహస్వామి చెంతకు పోయి విషయం చెప్పి అర్థ మర్థించింది. ఆయన "శ్రీనివాసుని కేమీ లోటుండదు. నీవీ విషయమై చింతించవద్దు. బ్రహ్మాది దేవతలే దిగివచ్చి ఈ పెండ్లి జరిపిస్తారు" అని చెప్పాడు.

వకుళ తిరిగి శ్రీనివాసుని వద్దకు వచ్చి వరాహస్వామి అభిప్రాయం తెలియజేసింది.

తదనంతరం శ్రీనివాసుడు శేషుణ్ణీ, గరుడుణ్ణీ స్మరించాడు. వారు వెంటనే వచ్చి ఆ దేవునకు ప్రణమిల్లారు. శ్రీహరి పెండ్లివార్త తెలుపుతూ ఒక ఆహ్వానలేఖ వ్రాసి గరుడుని ద్వారా బ్రహ్మదేవునికి పంపాడు. మరొక శు భలేఖను శేషుని ద్వారా శివునకు పంపాడు.

## బ్రహ్మరుద్రాదుల రాక

లేఖ అందుకున్న విధాత పెండ్లికి రాదగిన వారి కందరికీ ఈ శుభవార్త తెలిపి వారినందరినీ రమ్మని చెప్పాడు. తాను సరస్వతీ సమేతుడై హంసనెక్కి వేంకటాచలం చేరుకొన్నాడు. శ్రీనివాసుడు పద్మసంభవుణ్ణి సముచితంగా ఆదరించి జరిగిన సంగతిని విశదంగా వివరించాడు.

శేషుని ద్వారా లేఖ అందుకొన్న శివుడు గూడా పార్వతీ సమేతుడై వృషభవాహన మెక్కి ప్రమథగణాలు సేవిస్తుండగా వృషగిరికి వచ్చాడు. శ్రీనివాసు డాదేవుణ్ణి ఉచిత రీతిని సత్కరించి సంగతులు తెలియపరచాడు. ఇంతలో ఇంద్రాదులైన దేవతలు గూడా సపరివారంగా అక్కడికి చేరి ఉచితాసనా లధిష్ఠించారు. శ్రీహరి వచ్చిన వారికందరికీ తన పెండ్లిని గూర్చి వివరించాడు. అందరూ హర్షం ప్రకటించారు.



ఇంద్రుని ప్రేరణతో విశ్వకర్మ నారాయణపురం చేరి మరకత మణితోరణాలంకృతమైన ఒక స్వర్ణమందిరం నిర్మించాడు. వకుళ పెండ్లి పనులు తగినవారి కప్పగించి ఆ యా కృత్యాలకు వారిని పురికొల్పి అన్నీ సిద్ధం చేసింది.

బ్రహ్మ శ్రీనివాసుణ్ణి అభ్యంగనానికి రమ్మని పిలిచాడు. కాని శ్రీనివాసుడు చింతాక్రాంతుడై "విరించీ! లక్ష్మి కొల్లాపురంలో ఉన్నది. ఆమె లేకుండా నేనెలా అభ్యంగనాని కంగీకరించేది? ఆమె లేని ఈ పెండ్లి గూడా నా కిష్టం లేదు" అని విషాదానికి లోనయ్యాడు.

అంతట లక్ష్మిని పెండ్లి కాహ్వానించడమే అన్నివిధాలా తగిన కర్తవ్యమని అందరూ భావించారు. ఆమెను తోడ్కొని రమ్మని సూర్యుణ్ణి పంపారు.

## లక్ష్మీదేవి రాక

సూర్యుడు వెంటనే కొల్లాపురం చేరి "అమ్మా! పద్మనాభుడు అశక్తుడై దీనస్థితిలో ఉన్నాడు. శేషాచలస్థుడైన ఆ మహితాత్ముడు నిన్ను చూడాలని కోరుతున్నాడు" అని లక్ష్మితో చెప్పాడు.

అది విన్న లక్ష్మి వెంటనే రథమెక్కి ఆకాశమార్గంలో శేషాచలం చేరింది. అక్కడ ఉన్న సురలందరూ ఆమెకు మ్రొక్కారు. శ్రీనివాసుడామెను గౌరవించాడు. రహస్యంగా ఆమెకు చెప్పదగిన మాటలు కొన్ని చెప్పాడు. వైకుంఠం వీడిన నాటినుండి జరిగిన సంఘటనల నన్నింటినీ ఆమెకు వివరించాడు. పద్మావతిని చేపట్టడానికి ఆమె సమ్మతి కావాలని కోరాడు. లేకుంటే ఈ పరిణయం జరగదని పలికాడు.

విషయమంతా ఆకళించుకొన్న ఇందిరాదేవి శ్రీనివాసుని పెండ్లికి సమ్మతించింది. తదుపరి పెండ్లి కుమారునికి అభ్యంగనాది మంగళకార్యాలు కొనసాగాయి. లక్ష్మీదేవి కూడా అభ్యంగన విధి నాచరించింది.

యజుశ్శాఖానుక్రమంగా వైఖానస సూత్రోక్త విధానంతో పుణ్యాహ వాచనాది కార్యాలు జరిగాయి. శ్రీనివాసుడు తన కులదేవత అయిన శమీ వృక్షానికి ప్రదక్షిణనమస్కారాలు చేసి పూజించాడు.

పిమ్మట శ్రీనివాసుడు భూవరాహస్వామిని భూదేవతా సమేతంగా తన పెండ్లి కాహ్వానించాడు. ఆయన తాను రాకుండా తనకు మారుగా వకుళ రాగలదని చెప్పి పంపాడు.

## అప్పుపత్రం

పెండ్లికి కావలసిన ద్రవ్యాన్ని లక్ష్మి నర్థించడం సముచితం గాదని శ్రీనివాసుడు భావించాడు. అందువల్ల కుబేరుణ్ణి పిలిచి పెండ్లికి ధనమిమ్మని అర్థించాడు.

"నేను వడ్డి పత్రము వ్రాసియిస్తాను. ఏటేటా క్రమం తప్పక వడ్డీ చెల్లిస్తాను. కలియుగం చివర అప్పు అసలు గూడా చెల్లిస్తాను. ఇందుకు బ్రహ్మదేవుడు, శంకరుడు సాక్షులు" అని చెప్పాడు.

"వడ్డీ అక్కర లేదు. నీకు కావలసినంత ధనమిస్తాను" అని కుబేరుడు చెప్పగా "నేను దానంగా నీనుండి ధనం స్వీకరించను, వడ్డీ చెల్లిస్తాను" అని శ్రీనివాసుడన్నాడు.

ఆపై బ్రహ్మనూ, శివుణ్ణీ చూచి "నేను కలియుగాంతం వరకూ ఈ గిరిపై కాపురముండి భక్తకోటి ననుగ్రహిస్తాను. వారినుండి విత్తం కానుకలుగా గ్రహించి కుబేరుని అప్పు తీరుస్తాను. మీరిరువురూ ఈ రావిచెట్టూ ఇందుకు సాక్షులు" అని చెప్పి ఆ రీతిగా పత్రం వ్రాసి కుబేరుని కందజేశాడు. కుబేరుడు పదునాలుగు లక్షల రామటెంకి నిష్కములు అప్పుగా ఇచ్చాడు.

తదుపరి పెండ్లికి వచ్చిన వారి కందరికీ కమ్మని విందుభోజనాలు జరిగాయి. సాయం సమయమయింది. సూర్యుడు వెలుగును ప్రసరింపజేసే పనిని చంద్రుని కప్పగించి తాను అస్త్రాద్రికి చేరాడు.



పిదప చంద్రు డుదయించి తరపి వెన్నెలలతో లోకానికి ఆహ్లాదం కలిగించాడు. రాత్రి గడచి తూర్పు తెల్లవారింది. సూర్యుడు ఉదయగిరిపై కాలూనాడు.

పెండ్లికి వచ్చిన వారెల్లరూ పుష్కరిణిలో స్నాన సంధ్యాది విధులు యథావిధిగా నిర్వర్తించారు.

తదుపరి మంగళవాద్యాలు మ్రోగుతుండగా అందరూ వారి వారి వాహనాల నధిష్ఠించి శేషాద్రి దిగి కపిలతీర్థమార్గంలో పయనించారు. శుకాశ్రమం మీదుగా వెళ్ళి నవమినాటి సాయంకాలానికి నారాయణపురం చేరుకున్నారు.

ఆకాశరాజు యథావిధిగా వారికి స్వాగతం పలికి తగిన సత్కారాలు జరిపించాడు. వివాహవిధికి సంబంధించిన నవగ్రహ యజ్ఞాది విధానాలన్నీ శాస్త్రోక్త పద్ధతిలో జరిగాయి. పెండ్లికి వచ్చినవారు ఆ రాత్రి విడిది గృహంలో సుఖంగా విశ్రమించారు.

మరునాడు అరుణోదయంకాగానే అందరూ స్నానాదికాలు పూర్తి చేశారు. ఉపవాస నియమం కొందరు (పాటించవలసినవారు) పాటించారు. నాటి సాయంకాలం ఆకాశరాజు ధరణిదేవీ సమేతుడై వరుని పక్షం వారున్న విడిదికి పోయి అక్కడ శ్రీనివాసుణ్ణి సంప్రదాయాను సారంగా సమ్మానించాడు.

## పద్మావతీ శ్రీనివాసుల పరిణయం

ఆపై శ్రీనివాసుడు లక్ష్మీసమేతంగా ఐరావతము నెక్కి మంగళ వాద్యాలు మ్రోగుతుండగా, బ్రహ్మాదులు తన్ను వెన్నంటిరాగా, నగరప్రవేశం చేశాడు. భూపతి మందిర ద్వారం వద్ద నిలిచాడు. మంగళవాద్యాలు ధ్వని స్తుండగా

తొండమానుని భార్య ముత్తైదువలతో వచ్చి సంతోషాతిశయంతో శ్రీహరికీ, సిరికీ మంగళారతు లిచ్చింది.

హారతులిచ్చిన వారికి కుబేరునిచేత చీనాంబరాలు, దక్షిణలు (నిష్కములు) శ్రీనివాసు డిప్పించాడు. పిమ్మట అంతఃపురం ప్రవేశించి లక్ష్మీసమేతుడై స్వర్ణ సింహాసన మధిష్ఠించాడు.

అనసూయ మున్నగు సువాసినులు పెండ్లి కుమార్తె పద్మావతిని యథోచితంగా అలంకరించారు. పద్మావతి గౌరీపూజ నిర్వహించింది. ధరణీదేవి సువాసినులు వెంట నడువగా పుత్రికతో వివాహమండపం చేరింది.

వసిష్ఠమునీంద్రుడు వివాహ క్రియ లనుష్ఠించాడు. కనకరత్నాభరణ భూషిత అయిన కన్యను ఆకాశరాజు శ్రీనివాసునికి ధారాదత్తం కావించాడు. మాంగల్యకంకణ ధారణలు, హోమం, సప్త పదాతిక్రమణం, అరుంధతీ దర్శనం మొదలైన వివాహవిధులు సాకల్యంగా జరిగాయి. అక్కడ చేరిన జనుల కందరికీ ఫల దక్షిణా తాంబూలాదులు అందాయి.

ఇలా పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం నారాయణపురంలోని అకాశరాజు గృహంలో వైభవోపేతంగా నిర్వర్తింపబడింది.

ఆ మరునా దరుణోదయవేళలో శ్రీహరి ప్రయాణోన్ముఖుడై పద్మావతిని తనతో పంపుమని ఆకాశరాజు నడిగాడు. రాజు ''మీరు ఒక నెలరోజులయినా ఇక్కడే ఉండండి'' అని చెప్పాడు. ''అక్కడ ఎన్నో పనులున్నాయి. అలా ఇక్కడ నిలవడానికి వీలుకాదు" అని శ్రీనివాసుడు అన్నాడు. లక్ష్మీదేవి పద్మావతిని శ్రీనివాసుని వెంట పంపవలసినదనీ, అక్కడ వకుళమాలిక అమ్మలాగా ఆమెను చూచుకొంటుందనీ చెప్పింది.



రాజు కుమార్తెకూ, అల్లుడికీ దివ్యాంబరాభరణాలు సమర్పించాడు. అమ్మాయిని అనురాగంతో చూచుకొమ్మని చెబుతూ అశ్రుసిక్తనేత్రు డయ్యాడు. "మామా! మీకుమార్తె కొరకై మీరు ఇంతగా చింతించ వద్దు" అంటూ శ్రీనివాసుడు పద్మావతితో గూడా గరుడారూఢుడై వేంకటాద్రికి పయనించాడు.

బ్రహ్మాది దేవతలు వెంటరాగా శ్రీనివాసుడు అగస్త్యాశ్రమం చేరి ఆ దినం అక్కడ గడపాడు. ఆ మరునాడు పద్మసంభవాదులు శ్రీనివాసుని అనుమతితో వారి వారి నివాసాలకు వెళ్ళారు. లక్ష్మీదేవి హరి నెట్లో అంగీకరింపజేసి తిరిగి కొల్లాపురం చేరింది.

## అగస్త్యాశ్రమ నివాసం

అపై శ్రీనివాసుడు అగస్త్యమునితో "మునీంద్రా! మేమిక వేంకటాచలానికి బయలు దేరి వెళ్తాము" అని చెప్పాడు. అగస్త్యుడు "శ్రీనివాసా! పెండ్లి కుమారులు ఆరునెలల వరకు వేంకటాద్రిపైకి వెళ్ళడం తగదు గదా! అంత వరకూ మీరిక్కడే వుండండి" అని చెప్పాడు.

అందుకంగీకరించి శ్రీనివాసుడు సతీసమేతంగా ఆరునెలల కాలం అగస్త్యాశ్రమంలోనే వెళ్ళబుచ్చాడు.

పద్మావతీ శ్రీనివాసుల ఉద్వాహం జరిగిన తరువాత కొంతకాలానికి ఆకాశరాజు కాలధర్మం చెందాడు. వసుదానుడు తండ్రికి ఔర్ధ్వదైహిక క్రియలు నిర్వర్తించాడు. ఈ వార్త విని శ్రీనివాసుడు అగస్త్యాశ్రమం నుండి నారాయణపురానికి వెళ్ళి వసుదాన తొండమానులను విచారించి వారికి దుఃఖోపశమనం కావించాడు. మరల అగస్త్యాశ్రమం చేరి తండ్రిని తలచుకొని శోకిస్తున్న పద్మావతిని ఓదార్చాడు.

ఇంత వరకూ శ్రీనివాసుని చరితం విన్న శౌనకాదులు "ఆకాశరాజు మృతిచెందిన పిదప అతని పుత్రుడు వసుదానుడు తమ్ముడు

తొండమానుడు–వీరిరువురిలో ఎవరు రాజ్యాధిపత్యం స్వీకరించారు" అని సూతుణ్ణి ప్రశ్నించారు.

సూతుడిలా చెప్పాడు –

## వసుదాన తొండమానుల యుద్ధం

"మునులారా! ఆకాశరాజు తర్వాత తనదే రాజ్యాధికారమని తొండమాను డన్నాడు. వసుదానుడు కూడ తనకే రాజ్యాధిపత్యం సంక్రమించాలన్నాడు. అలా వారిద్దరూ రాజ్యంకోసం కలహించుకొన్నారు.

తొండమానుడు యుద్ధంలో ఎవరు జయిస్తే వారిదే రాజ్యాధికార మని సంగ్రామానికి సిద్ధమైనాడు. వసుదానుడు సైతం అందుకు సమాయత్త మయ్యాడు. ఇరువురూ తమ తమ బలగాలు సమకూర్చుకొన్నారు.

శ్రీనివాసునికి పరమభక్తుడైన తొండమానుడు ఆ దేవుని దగ్గరకు వెళ్ళి అన్న కొడుకుతో కలిగిన వివాదమును గురించి వివరించాడు. సంగరంలో తనకు తోడ్పడవలసినదిగా అర్థించాడు.

"నేను తొండమానునికి సంగ్రామంలో సాయం చేస్తే పద్మావతి అలుగుతుంది. వసుదానుని పక్షాన చేరితే ఆమె సంతసిస్తుంది. కాని తొండమానుడు నాకు పరమభక్తుడు. ఈ విషమసమయంలో వీరిరువురిలో ఎవరినీ నిరాకరించే స్థితిలో లేను. ఇప్పుడేమి చేయాలి" అని తనలో తాను శ్రీనివాసుడు విచారానికి లోనయ్యాడు.

పిమ్మట యుద్ధంలో తొండమానునికే విజయం సిద్ధిస్తుందని అతనితో రహస్యంగా చెప్పి సాయంగా తన చక్రమిచ్చి పంపించాడు.

ఆ మీదట వసుదానుడు గూడా వచ్చి సాయం అర్థించాడు. అతడు కోరిన ప్రకారం శ్రీనివాసుడు అతనితో గూడి నారాయణపురానికి వెళ్ళాడు. అక్కడ బావమరది పక్షాన చేరి యుద్ధభేరి వేయించాడు.



ఇరుపక్షాలకు పోరు ఘోరంగా జరిగింది. యుద్ధం తీవ్రతరమైనప్పుడు తొండమానుడు శ్రీహరి చక్రాన్ని వసుదానునిపై ప్రయోగించాడు. శ్రీనివాసు డతనికడ్డం రాగా చక్ర మా దేవునికే తగిలింది. ఆయన మూర్ఛితుడై రథంపై ఒరిగాడు.

అంతట తొండమాన–వసుదాను లిరువురూ కలసి కలహం మాని శ్రీనివాసునికి ఉపచారం చెయ్యడానికుపక్రమించారు. శ్రీనివాసుడు మూర్ఛనుండి తేరుకొని లేచి కూర్చున్నాడు. తొండమాను డాదేవునికి నమస్కరించి యిలా అన్నాడు.

"హరీ! నేను ప్రయోగించిన చక్రం నీకు తగిలి మూర్ఛితుడ వయ్యావు. నీకపకారం చేసిన పాపం నన్ను చుట్టుకొన్నది. దీని పరిహారం కొరకై నేను కాశీక్షేత్రానికి పోతాను. అందుకు నాకు అనుమతి నిమ్ము. రాజ్యం వసుదానునికే కట్టబెట్టు. ఇక నాకీ రాజ్యంతో పనిలేదు. నాకు వైరాగ్యం ప్రసాదించు".

అప్పుడు శ్రీహరి వసుదానుని వైపు చూచి 'నీ అభిమత మేమి?' అని అడిగాడు. వసుదానుడు "హరీ! నన్ను కాపాడడానికి నీవు అడ్డు రాగా చక్రం నిన్ను తాకింది. ఆ పాపం నాకే అంటింది. దాని పరిహారం కొరకై నేను రామేశ్వరక్షేత్రానికి వెళ్తాను. ఈ రాజ్యాధికారం నా పినతండ్రిదే" అని అన్నాడు.

అది విని శ్రీనివాసుడు శుకయోగిని పిలిపించి విషయం వివరించి 'కిం కర్తవ్యం' అని అడిగాడు. "వీరు కాశికీ, రామేశ్వరానికీ పోబనిలేదు. అన్నదమ్ముల భాగం విభజించి ఆకాశరాజుకు చెందిన భాగాన్ని వసుదానునికీ, తక్కిన భాగాన్ని తొండమానునికీ యివ్వడం అన్ని విధాలా సముచితం" అని శుకయోగి తీర్పుచెప్పాడు.

శ్రీనివాసుడు ఆ యోగివర్యుడు చెప్పిన విధంగా రాజ్యాన్ని విభజించి వారిరువురికీ అప్పగించాడు. వారందుకు సమ్మతించారు. తిరిగి శ్రీనివాసుడు పద్మావతి చెంతకు చేరాడు.

అర్ధరాజ్య ప్రాప్తి పొందిన తొండమానుడు భోగాసక్తి వదలి వాసుదేవునిపై భక్తిపెంచుకొన్నాడు. ఆయన నరరూపంలో ఉన్న నారాయణుడన్న సత్యం గ్రహించాడు.

## విశ్వరూపదర్శనం

ఒకనా డతడగస్త్యాశ్రమానికి వచ్చి శ్రీనివాసునికి దండప్రణామం చేశాడు. అతని భక్తికి మెచ్చి భగవానుడతనికి అత్యద్భుతమైన తన విశ్వరూపం చూపాడు. అది చూచి తొండమానుడు పులకిత శరీరుడై ఆ దేవుని దివ్యరూపాన్ని బహువిధాల సన్నుతించాడు.

## దేవాలయ నిర్మాణం

అనంతరం శ్రీనివాసు డతణ్ణి చూచి వేంకటాద్రిపైన తన కొక కనకమయమైన మణిభవనం దేవాలయ రూపంలో నిర్మించి యిమ్మని కోరాడు. పూర్వజన్మలో ఆ తొండమానుడు రంగదాసుడన్న పేరుతో తిరుమలపై భగవత్కైంకర్యపరుడై యుండిన వృత్తాంతాన్ని శ్రీహరి అతనికి తెలిపాడు.

అందు కాశ్చర్యపడి ఆ రాజు విశ్వకర్మను పిలిపించి అతనితో గూడ వేంకటాచలం చేరాడు. అక్కడ శిల్ప శాస్త్ర ప్రకారం మూడు ప్రాకారాలు, రెండుగోపురాలు, ఏడు ద్వారాలు, ఆస్థానమండపం, ముఖమండపం, గోశాల, ధాన్యశాల, వంటశాల మున్నగు నిర్మాణాలతో, వసతులతో విశ్వకర్మ చేత సుందరమైన మందిరం నిర్మింపజేశాడు.



నిర్మాణం పూర్తి కాగానే కొండదిగి శ్రీహరిని చూచి "మీరు కోరిన మందిరం సిద్ధమయింది. సతీసమేతంగా అక్కడికి వేంచేయండి. నేను మీ కింకరుడనై సేవలు చేస్తాను" అని విన్నవించాడు.

## ఆనంద నిలయప్రవేశం

ఆ మీదట శ్రీనివాసుడు బ్రహ్మ, శుకుడు, అగస్త్యుడు తన వెంటరాగా పద్మావతితో గూడ కొండ నధిష్ఠించాడు. మంగళ ధ్వనులు వినిపిస్తుండగా వికృతినామ సంవత్సరం అశ్వనీ నక్షత్రం గురువాసరంతో కూడిన శుభ దినాన పుణ్యాహవాచనాది కార్యాలు పూర్తిచేసి ఆనందనిలయంలో ప్రవేశించాడు. బ్రహ్మేంద్రాదులా సమయంలో పుష్పవృష్టి కురియించారు. శ్రీనివాసుణ్ణి వినుతించారు.

వైఖానస ద్విజులు ద్వారపాలకులను ద్వారం వద్ద నిల్పి యథాక్రమంగా శ్రీహరిని అర్చించారు. ఆ దేవుడు పద్మ పీఠంపై పాదాలుంచి నిలిచాడు. కటి ప్రదేశంపై ఎడమచేయి ఉంచాడు. దక్షిణహస్తం దక్షిణ పాదం వైపు చూపుతూ వెలుగొందాడు. బ్రహ్మాదులతో 'ఇది పరమపద' మని పలికాడు.

అంతట బ్రహ్మదేవుడు దేవదేవుని సన్నిధిలో రెండు అఖండ దీపాలు నిలిపి "కలిధర్మ మున్నంత వరకూ ఈ దీపాలుంటాయి. దీపాలున్నంత వరకూ ఈ దివ్యవిమాన ముంటుంది. కలియుగాంతంలో ఈ దీపాలారి పోతాయి. విమానం నేలగూలుతుంది. అప్పుడు వేంకటేశ్వరుడు శ్రీవైకుంఠం చేరుకుంటాడు. ఆ తరువాత మళ్ళీ కృతయుగం ప్రారంభమవుతుంది. మూడు యుగాలు వైకుంఠ నిలయుడై వుండిన భగవానుడు కలియుగంలో శేషాద్రిపై నిలుస్తాడు" అని ప్రకటించాడు.

ఆ మీదట బ్రహ్మతో శ్రీనివాసుడు "పరమేష్ఠీ! నాకు నీ విక్కడ రథోత్సవం నిర్వహించు" అని నిర్దేశించాడు.

వెంటనే బ్రహ్మ తొండమానుని ద్వారా వైఖానసాగమవిధిననుసరించి అంకురార్పణం, ధ్వజారోహణం, వివిధ వాహనసేవలు, రథోత్సవం, తీర్థవారి మున్నగు దైవకార్యాలు నిర్వర్తింపజేశాడు. నానా విధాలైన అన్ననై వేద్యాలు సమర్పించి 'సర్వం శ్రీనివాసార్పణం' అని చెప్పాడు. శ్రీవేంకటేశ్వరస్వామి ఎంతో సంతోషించాడు.

ఆ తరువాత బ్రహ్మదేవుడు ఇంద్రాది దేవతలను వారి వారి నిలయాల కంపి తాను గూడా సత్యలోకం చేరాడు.

తొండమానుడు రాజ్యపాలన చక్కగా సాగిస్తూ శ్రీవేంకటేశ్వరునికి సకలోత్సవాలు ఏర్పాటు చేశాడు. అనుదినం వెళ్ళి స్వర్ణకమలాలతో శ్రీనివాసుణ్ణి అర్చించసాగాడు.

## భీమునికి సాయుజ్య ప్రదానం

ఇది యిట్లుండగా ఒక కుమ్మరివాడు భక్తిసంపన్నుడై తన యింటనుండిన శ్రీవేంకటేశ్వర స్వామి దారుమూర్తికి మట్టి పూలతో నిత్యం పూజలు చేయసాగాడు. ఆ పూలు శ్రీనివాసుని సన్నిధికి చేరేవి. వాటిని తొండమానునికి కనిపించ నీకుండా శ్రీహరి తనలోనే దాచుకొనేవాడు.

రాజు స్వర్ణ కుసుమాలతో అనుష్ఠించే పూజ రాజసమని దేవుడు భావించాడు. ఒకరోజు రాజు పూజ కావిస్తున్న సమయంలో అతనికి మట్టి పూలు చూపాడు. "ఈ పూలెక్కడివి? నేను సమర్పించిన కనక కుసుమాలను కడకు నెట్టి వీటినిక్కడ బెట్టిన వాడెవడు?" అని రాజు శ్రీనివాసుణ్ణి ప్రశ్నించాడు.

అప్పుడు భగవంతుడిలా అన్నాడు. "ఇక్కడికి రెండున్నర క్రోసుల దూరంలో 'కుర్వక' మనే పల్లె ఉన్నది. అక్కడ భీముడనే కుమ్మరి ఒకడున్నాడు.



అతడు నిరుపేద. నిత్యమూ కుండలు చేసి తన బ్రతుకు దెరువు సాగిస్తాడు. అప్పుడప్పుడూ కుండలు చేసే కాలంలో రెండు చేతుల కంటిన మట్టిని పూలుగా మలచి తాను ప్రతిష్ఠించుకొన్న నా దారుమూర్తికి అర్పిస్తాడు. భక్తితో అనుదినమూ అతడలా చేస్తున్నాడు."

అది విని రాజు ఆశ్చర్యచకితుడయ్యాడు. త్వరగా తన పూజ ముగించి భీముని వద్దకు వెళ్ళాడు. అతడు రాజును చూచి విభ్రాంతుడై "ప్రభూ! తమ రిక్కడకు రావడ మేమిటి? ఆశ్చర్యంగా వున్నదే!" అని అన్నాడు. అందుకు రాజు "భీమా! నీ భక్తిని భగవంతుడు మెచ్చుకొన్నాడు. అందలి ఆంతర్య మేమిటో నాకు చెప్పు" అని పలికాడు.

కులాలు డందుకీరీతిగా బదులు చెప్పాడు. "మహారాజా! నేను శూద్రుడను, జడమతిని. విష్ణుభావన గురించి మీకు చెప్పగల్గినంతటి వాడనా?"

ఇంతలో గరుడవాహనారూఢుడై శ్రీనివాసుడక్కడికి వచ్చాడు. భీముని జూచి "పుణ్యపురుషా! ఇటు రమ్ము! నీకు నేడు సాయుజ్య మిస్తున్నాను" అని అనుగ్రహించాడు. అది విని స్వామికి ప్రణమిల్లి భీముడు సతీ సమేతంగా శ్రీహరి సాయుజ్య పదం అందుకొన్నాడు.

అప్పుడు రాజు స్వామితో "కమలాక్షా! నేను నీ భక్తవర్యుడయిన భీమునితో సంభాషిస్తూ వుండగానే నీవు వానికి సాయుజ్యం ప్రసాదించావు. ఇలా నన్నెప్పు డనుగ్రహిస్తావు?" అని అడిగాడు.

శ్రీహరి చిరునవ్వు నవ్వి "భీమునిది సాత్త్విక భక్తి. దాని నంగీకరించి అతనికి పరమపద మిచ్చాను. ఇంతకు ముందే అతడు నన్ను మోక్ష మర్థించాడు. నీ పూజ పరులకు తెలిసి చక్రవర్తి నీయింటికి వచ్చినప్పుడు

నీకూ, నీసతికీ సాయుజ్యం ప్రసాదిస్తానని చెప్పివున్నాను. ఆ పని యిప్పుడు చేశాను" అని అన్నాడు.

మళ్ళీ రాజుతో ఇలా చెప్పాడు "నీవు దీనికి చింతించవద్దు. నీ కుమారునికి పట్టం గట్టు. భక్తి విజ్ఞాన వైరాగ్యాలు కలిగియుండు. ఏకాంతంలో నన్ను ధ్యానిస్తూ వుండు. నేను నీకు సాయుజ్య పదవి అనుగ్రహిస్తాను".

అంతట తొండమానుడు తిరిగి నిజనివాసానికి పోయాడు. పుత్రుడైన శ్రీనివాసుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు. శ్రీవేంకటేశ్వరస్వామి చరణార విందాలను సేవిస్తూ నిత్యమూ ఉత్సవాలు నిర్వహించాడు. భక్తి జ్ఞానాలు పెంపొందించుకొన్నాడు. మహావిరక్తుడయ్యాడు. ఏకాంతంలో ధ్యానయో గమనుష్ఠించాడు.

## తొండమానునికి సారూప్యం

ఆపై కొంతకాలానికి శ్రీహరి కరుణించి అతని సన్నిధికి వెళ్ళాడు. రాజు భక్తి ప్రపత్తులతో శ్రీహరిని వినుతించాడు.

స్వామి అతణ్ణి అనుగ్రహిస్తూ "రాజా! నీవిప్పుడు భక్తి నిష్ఠుడవయ్యావు. నీకు తప్పక ముక్తి ప్రసాదిస్తాను. అది యిప్పుడే కావాలా, లేక ఇంక కొన్నాళ్ళకా" అని ప్రశ్నించాడు. రాజు వెనువెంటనే మోక్ష మిమ్మని ప్రార్థిస్తూ శరణాగతు డయ్యాడు.

భగవంతు డనుగ్రహించాడు. ఇంతలో ఒక దివ్యవిమానం ఆకసం నుండి దిగింది. తొండమానుణ్ణి ఆ పుష్పక మెక్కించి భగవంతుడతనికి సారూప్యం ప్రసాదించి వైకుంఠానికి పంపాడు. తిరిగి తన మందిరం చేరుకొన్నాడు.



తొండమానుని కుమారుడు తండ్రికి పరలోక విధులు నిర్వర్తించి శ్రీవేంకటేశ్వరుని పాదాంబుజాలపై భూభారముంచాడు. వసుదానునితో కలిసి నిత్యోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, సంవత్సరోత్సవాలు భక్తితో నిర్వర్తించాడు.

## అర్చావిగ్రహమూర్తి

శ్రీమన్నారాయణుడు శిలామూర్తియై వైభవోపేతంగా వెలుగొందాడు. వసుదానశ్రీనివాసుల ననుగ్రహించాడు. మౌన ముద్ర దాల్చినాడు. పద్మావతీ సమేతుడై భక్తులకందరికీ అభీష్టాలు ప్రసాదించాడు. వారిచ్చే కానుకలు స్వీకరిస్తూ శేషాద్రి శిఖరరత్నమై భాసించాడు.

ఇప్పటికీ ఆ దేవదేవుని అనుగ్రహం భక్తులపై ప్రసరిస్తున్నది. శ్రీవేంకటేశ్వరస్వామి విఖ్యాతి దశదిశలకూ విస్తరించింది. భక్తులనుండి విత్తం పరిగ్రహించి కుబేరునికి వడ్డీ చెల్లించడం కొనసాగిస్తూ ఆ దేవుడు తనమాట నిలబెట్టుకొన్నాడు.

స్వామి లీలామానుష చర్యలు కోకొల్లలు. కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వామిని లక్షల కొలది భక్తులు సేవిస్తున్నారు. తిరుమల కలియుగవైకుంఠమై వెలుగొందుతున్నది".

ఇలా సూతుడు చెప్పగా విని మునులందరూ సంతోష భరితులయ్యారు. సూతుణ్ణి పలువిధాల కొనియాడారు.

ఆ మీదట స్వామి పాషాణ రూపుడెందు కయ్యాడని మును లడుగగా సూతుడీ విధంగా చెప్పాడు.

"అనఘాత్ములారా! శ్రీనివాసుడు నిజస్వరూపాన్ని అందరికీ చూపడు. అందువల్ల సకలజనులూ దర్శించి తరించడాని కనువుగా స్వామి దయతో

తన చిహ్నాలు ప్రదర్శిస్తాడు. తామ్రమూర్తిగా, శిలామూర్తిగా, మృత్తికామూర్తిగా, దారుమూర్తిగా వెలుగొందుతూ నానా నామాలతో పూజలు గొంటూ భక్తకోటి ననుగ్రహిస్తాడు.

ఇవన్నీ అర్చామూర్తులు, హరి చిహ్నాలు. చర్మచక్షువులతో జూచిన విగ్రహాలు మనోదృష్టికి ప్రత్యక్షమవుతాయి. దర్శించే వారి మనోమాలిన్యాన్ని తొలగిస్తాయి. సర్వజనులనూ కడతేర్చడానికి అర్చావిగ్రహాలే ముఖ్యసాధనాలు. ప్రతిమలనర్చించి తద్వారా హరి సర్వాంతర్యామి అని గ్రహించాలి. రామకృష్ణాది విభవావతారాలను ధ్యానించాలి. తదీయ గుణానుభవం పొందాలి. తద్వారా అనిరుద్ధ-ప్రద్యుమ్న-సంకర్షణ-వాసుదేవాత్మకమైన ప్యూహ ప్రభావం తెలుసుకొని ధ్యానం చేయాలి. పరమగతి ప్రాప్తికి అర్చారూపాలు పరమహేతువులు.

సర్వజనులనూ రక్షించడానికే శ్రీనివాసుడు స్వయం వ్యక్తమైన అర్చామూర్తిగా విలసిల్లాడు. అదేవునికి మంగళమగు గాక"!

ఇలా వచించిన సూతుని మాటలు విని మునులు వేంకటపతిని ప్రస్తుతిస్తూ సూతునితో శుభగోష్ఠి కొనసాగించారు.

# చతుర్థ ప్రకరణం

శ్రీనివాసుని అర్చావతారచరిత్రను విన్న శౌనకాదిమునులు సంతుష్టులై సూతుణ్ణి చూచి ఇలా అన్నారు.

"సూతా! శ్రీనివాసస్వామి చరిత్ర ఎంతగా విన్నా తనివి తీరడం లేదు. ఆ దేవుడు పద్మావతిని చేపట్టిన పిదప మహాలక్ష్మి మరల కొల్లాపురం చేరింది కదా! స్వామి ఆ దేవిని తలపులో నిలుపుకొన్నాడా? లేక విస్మరించాడా? వక్షఃస్థలంలో ఆమెను మరల చేర్చుకొన్నాడా లేదా? ఈ విషయం వివరించు".

వారి ప్రశ్న విని చిరునవ్వు నవ్వి రౌమహర్షణి వ్యాసుణ్ణి స్మరించి యిలా బదులు పలికాడు.

"ఇప్పుడు మీరు నన్నడిగినట్లే పూర్వం దేవలుడు దేవదర్శనుణ్ణి ప్రశ్నించాడు. అప్పుడు దేవదర్శనుడు చెప్పిన వృత్తాంతం మీకు వివరిస్తాను, వినండి!

## వేంకటేశ్వరునికి లక్ష్మిని గూర్చిన చింత

శ్రీవేంకటేశ్వరుడు పద్మావతిని కూడి వుండినా రమాదేవిని విస్మరించలేదు. పలుసార్లు ఆమెను స్మరించాడు. ఆలా కొన్ని సంవత్సరాలు గడచాయి. ఇంకా ఆమెను దగ్గఱ చేర్చకుండా వుండడం ఏమాత్రం సముచితం కాదు అని చింతింపసాగాడు.

పద్మావతి ఆ దేవుని చిత్తవృత్తిని గ్రహించింది. ఒకనాడు పతితో "స్వామీ! మీ చిత్తం చింతాక్రాంతమయినట్లు మీ వదనం చూస్తే తెలుస్తున్నది. మీ చింతకు హేతువేమో తెలుసుకొనవచ్చునా"? అని పాదప్రణామం చేసి ప్రశ్నించింది.

ఇక చెప్పక తప్పదని భావించిన శ్రీనివాసుడు "పద్మావతీ! సృష్టి లేని కాలంలో నేను నిర్గుణ బ్రహ్మమై వుంటిని. అంతట చిద్రూపిణియైన లక్ష్మి నన్ను చేరింది. నాకెంతో ఆనందం కల్గించింది. లక్ష్మి కలయికతోనే నేనీ ప్రపంచ సృష్టికి కర్తనయ్యాను. నా మహత్త్వమంతా ఆ దేవీ కటాక్ష ఫలమే. ఇప్పుడామె నన్నెడ బాసివున్నదనే చింత నన్ను ఆవహించింది. భృగుపాద స్పర్శ ఈ యెడబాటుకు కారణం. ఆమె నన్ను విడిచిన నాటి నుండీ ఎన్నో క్లేశాలకు గురి అయ్యాను. అష్టకష్టాలు పడ్డాను. పెండ్లికి చేసిన అప్పు గూడా ఇంకా తీరలేదు" అని అన్నాడు.

అది విని పద్మావతి "నాథా! మీ గొప్పతనానికి కారణమైన లక్ష్మిని మీరిలా ఎడబాసి వుండడం తగదు. ఎలా అయినా ఆమెను సమ్మతింప జేసి తోడ్కొని రావడం మంచిది. ఆమె వస్తే మీ యిరువురికీ సేవ చేసే భాగ్యం నాకు కలుగుతుంది. మన మిద్దరమూ వెళ్ళి వెంటనే  ఆమెను తోడ్కొని వద్దాం, పదండి"అని పలికింది.

"పద్మావతీ! ఒంటి కాపురం చేస్తూ నీవిప్పుడు సంతోషంగా ఉన్నావు. లక్ష్మి వచ్చి నావక్షంపై కుదురుకొంటే సహించగలవా?" అని శ్రీనివాసు డామెను ప్రశ్నించాడు.

అందుకు పద్మావతి యిలా అన్నది. "స్వామీ! రమాదేవి మీ వక్షఃస్థలంపై నిల్చితే నాకు గలిగే కొదువ ఏమున్నది? సీతగా వున్నప్పుడు ఆమెయే కదా నన్ను పెండ్లాడుమని మీతో చెప్పింది. ఎట్లైనా ఆమె నిక్కడికి తీసుకురావాలి. నేను ఆమెను ఒప్పించి తోడ్కొని వస్తాను".

అది విని పద్మనేత్రుడు "నీ మాటలు నాకు సంతోషం కల్గించాయి. నీవు వకుళవద్దనే వుండు. నేనే వెళ్ళి రమాదేవిని తోడ్కొనివస్తాను" అని పలికాడు.



## పాతాళం చేరిన లక్ష్మి

వీరిరువురూ ఇలా మాట్లాడుకొన్న సంగతి కొల్లాపురంలో ఉన్న లక్ష్మి తన భావనాబలంతో గ్రహించింది. "ఇప్పుడు స్వామి వచ్చి నన్ను అక్కడికి రమ్మంటాడు. 'రాను' అని చెప్పలేను. నేనక్కడికి పోతే పద్మావతికి చింత తప్పదు. నాకెందుకీ కర్మ" అనుకొని ఆమె కొల్లాపురం విడిచి పాతాళంలోని కపిల ముని చెంతకు వెళ్ళింది. ముని ఆమెను ఉచిత రీతిని ఆదరించాడు.

శ్రీహరి కొల్లాపురం చేరాడు. అక్కడ లక్ష్మిని అన్వేషించాడు. ఆమె అక్కడ లేదన్న సంగతి తెలుసుకొని కలత జెందాడు. రమా వియోగవ్యథ ఆ దేవుణ్ణి బాధించింది.

ఆ మీదట లక్ష్మీదేవిని ఒక అర్చారూపంగా నిలిపి ఆ రూపాన్ని అర్చిస్తూ పదిసంవత్సరాల కాలం అక్కడే తపస్సు చేశాడు. ఒకనాడు ఆకాశవాణి పలికిన పలుకులాయనకు ఇలా చెవులబడ్డాయి.

## ఆకాశవాణి పలుకులు

"దేవా! రమాదేవి నీకిప్పుడు ఇక్కడ కనిపించదు. ఇటనుండి పోయి శేషాచలం చెంత ప్రవహించే సువర్ణముఖిని చేరి ఆ నదికి ఉత్తరతీరంలో తపోనిష్ఠుడవు కమ్ము. స్వర్గం నుండి స్వర్ణకమలం తెప్పించి అక్కడ ప్రతిష్ఠించు. దానికి తూర్పున సూర్యుణ్ణి ప్రతిష్ఠిస్తే ఆ కమలం  ముకుళించ కుండా సదా వికసించే వుంటుంది. నీవా పద్మంపై దృష్టి నిలిపి రమను అర్చిస్తే ఆమె ప్రత్యక్షమవుతుంది. పండ్రెండు సంవత్సరాలు చిత్తం శ్రీదేవి యందే నిల్పి మౌనంతో లక్ష్మీమంత్రం జపిస్తే ఆమె కనిపిస్తుంది. అప్పుడామెను నీ ఉరఃస్థలంపై నిలుపుకో!"

అది విని శ్రీనివాసుడు కన్నులు తెరచి అవి గగనవాణి మాటలని గ్రహించాడు. వెంటనే గరుడుణ్ణి అధిష్ఠించి శేషాద్రి చేరాడు. ఆ పర్వతం చెంతనే వున్న అగస్త్యాశ్రమానికి తూర్పు దిశలో ఉన్న సిద్ధస్థలం  చేరుకొన్నాడు.

## శ్రీవేంకటేశ్వరుని తపస్సు

అక్కడ వాయుదేవుణ్ణి స్మరించి ఆయన ద్వారా స్వర్గంగలోని సహస్రదళ పద్మాన్ని తెప్పించాడు. కుంతంతో గోకర్ణమంత గుంత ఏర్పరచాడు. అందులో ఆ పద్మనాళం నాటాడు. తూర్పున సూర్యుణ్ణి ప్రతిష్ఠించాడు. పద్మసరోవరానికి పడమటి దిక్కులో పద్మాసనస్థుడై ఏకాగ్రదృష్టి పద్మంపై నిలిపాడు. లక్ష్మీమంత్రం జపిస్తూ ఆమెను మనసా ధ్యానించాడు.

ఆ తపస్వి విష్ణువే అని గ్రహింపజాలక తపోభంగం చేయడానికై ఇంద్రుడు రంభాది దేవవనితలను పంపాడు. ఆ ముదితల హావభావాలు స్వామిని చలింప జేయలేకపోయాయి. చివరికి వారికి గుణపాఠం నేర్పడానికై స్వామి ఒక విశ్వజగన్మోహినిని సృష్టించాడు. ఆమెను చూచి రంభాదులు లజ్జితలై స్వామి నిజస్వరూపం గ్రహించి వెనుదిరిగిపోయి స్వర్గాధిపతికి జరిగిన వృత్తాంతం నివేదించారు. ఇంద్రుడు తన తప్పు గ్రహించి పశ్చాత్తాప తప్తుడయ్యాడు.

అప్పటికి శ్రీహరి పద్మావతిని వీడిపోయి 22 సంవత్సరాలు గడచాయి. ఆమె చింతాక్రాంతురాలయింది. వకుళమాలిక చెంత తన వంతను వ్యక్తం చేసింది. వకుళ ఆమెను తగిన మాటలతో ఊరడించింది.

అక్కడ కపిలాశ్రమంలో ఉండిన లక్ష్మి తనకొరకై పతి తపస్సు చేస్తున్నాడని తెలుసుకొని ఒకరోజు కపిలమహర్షిని చూచి ఇలా అన్నది.

"మునీంద్రా! శ్రీనివాసుడు పద్మావతిని చేపట్టాడు. ఆమెను కొండపై వదలిపెట్టి ఇప్పుడు నా కొరకై కొండక్రింద తపస్సు చేస్తున్నాడు. ఇప్పుడు నేనేమి చేయాలి?" అని అడిగింది. తాను హరిని వీడి వచ్చినందుకు భృగుపాదస్పర్శ కారణమని గూడా మునికి తెలిపింది.



## కపిలముని హితవచనాలు

కపిలముని ఆమెతో "ఆ భృగువు నీకు మనుమడే కదా! నీపతి ఈ సంగతి నీకు చెప్పలేదా? నీవు మూర్ఖతతో భర్త మాటలు వినక ఆయనను విడిచి కొల్లాపురం పోవడం తగునా? నీభర్తకు భృగుపాద స్పర్శ సమ్మతమైనప్పుడు నీకెందుకు కాలేదు? భృగువు చేసిన తప్పేమి? త్రిమూర్తుల యోగ్యతను పరీక్షించడానికి వచ్చాడు. బ్రహ్మరుద్రుల కంటే విష్ణువే మిన్నయని నిరూపించడానికై అతడలా ప్రవర్తించాడు. అతనిపై నింద మోపి నీపతిని పరిత్యజించి నీవే తప్పు చేశావు గదా!" అని పలికాడు.

మళ్లీ ఇలా అన్నాడు. "ఆ దేవుడు కరుణించి నిన్ను పిలవడానికి వస్తే నీకీ వంచన తగునా? నీకు తెలియని నీతి ఉన్నదా? పతివ్రతకీ తీరు ఉచితమా? 22 సంవత్సరాలనుండి నీకై తపిస్తున్న వాసుదేవుని విడిచి వుండడం నీకు భావ్యం కాదు. ఇప్పుడే బయలు దేరిపోయి శ్రీహరి నాటిన పద్మనాళం మార్గాన లోనికరిగి నీపతి దృష్టి నిల్పిన పద్మంపై నిలువు. బ్రహ్మాది దేవతలక్కడికి వస్తారు. అప్పుడు అందరి సమక్షంలో చక్రి వక్షఃస్థలం చేరుకో".

లక్ష్మీదేవికి కపిలమహర్షి చెప్పిన మాటలు సమంజసంగా తోచాయి. తన తప్పు గ్రహించింది. అలా తప్పు చేసిన శరీరంతో కాక మరొక శరీరంతో విష్ణువు పూజించే పద్మంలో ప్రవేశించాలని నిశ్చయించుకొన్నది. తన నిర్ణయాన్ని మునికి నివేదించింది.

"లోకమాతా! నీవు శ్రీహరికి నిత్యానపాయినివి. ఆ దేవుడెన్ని అవతారాలు దాల్చిన అన్ని శరీరాలు దాల్చిన ధన్యురాలవు. మీరు ఆదిమ దంపతులు. ఈ ముల్లోకాలను సృజించినవారు మీరే. ఏదో ఒక విశిష్టకార్యం ఉండడం వల్లనే ఇలా మీకిప్పుడు వియోగం సంభవించింది. నీవు తప్పు

చేశావన్నందుకు నాపై కోపించవద్దు. నాకు దోచిన విషయం నీకు చెప్పాను" అని కపిలమునీంద్రుడు పలికాడు.

లక్ష్మి "మునీంద్రా! నీవు చెప్పడం మంచిదయింది. నాలో విరోధభావం తొలగిపోయింది. పద్మావతీ సహితుడైన హరి ఉరముపై ఎలా ఉండేది? అన్న భావంతోనే నేను హరిని వంచించి వచ్చి నీఆశ్రమం చేరాను" అని చెప్పింది.

అందుకు ముని "చంద్రముఖీ! విష్ణుదేవుడు కృష్ణుడైనప్పుడే వేలకొలది కాంతలను గూడి అందరికీ అన్ని రూపులై అలరించినాడు గదా! అప్పుడు నీవు హరిని పత్యజించినావా? మా ఆశ్రమాన్ని పవిత్రం చేయడానికే నివిక్కడికి విచ్చేశావు. ఇకపై నీపతి నెడబాయకుండా శేషాద్రిపై నెలకొని వుండు" అని వచించాడు.

ముని మాటలకు రమాదేవి సంతసించింది. తన పూర్వశరీరాన్ని తపోనిష్ఠితం కావించి ఆశ్రమంలోనే నిలిపింది. ప్రత్యేకంగా ఒక దివ్య శరీరం దాల్చింది.

## వ్యూహలక్ష్మి ఆవిర్భావం

పద్మసరోవరంలోని కమలనాళంలో ప్రవేశించింది. నాళమార్గాన వచ్చి వచ్చి పద్మకర్ణికపై సుఖాసీనురాలయింది. మెరుపులన్నీ ఒకచో గుమిగూడినట్లు కనిపించింది.

విష్ణుభగవాను డామెను వీక్షించి పరమానందం పొందాడు. ఆమె శ్రీహరి వదనం చూచి సిగ్గుతో తల వంచుకొన్నది. తన కొరకు తపస్వియై జడలు దాల్చిన ఆ దేవుని వైరాగ్యశరీరం ఆమెకు వ్యథ కల్గించింది.



అది గ్రహించి విష్ణువు సకలాభరణభూషితుడై శంఖచక్రాలు దాల్చి నీలమేఘశరీరుడై కనిపించాడు. శ్రీదేవి మోహాతిశయంతో తన్ను చూస్తూ వుండగా తలవంచి మౌనం వహించాడు.

ఇంతలో బ్రహ్మరుద్రాదులు తమ తమ వాహనాలధిష్ఠించి పద్మసరోవరం చెంతకు వచ్చారు. మంగళవాద్యాలు ప్రయోగించారు. పుష్పవర్షం కురియించారు. శ్రీదేవినీ, శ్రీహరినీ నానావిధ స్తోత్రాలతో కీర్తించి వారికి నమస్కరించారు. అపుడు పద్మమందున్న లక్ష్మీదేవి నీక్షించి బ్రహ్మ రుద్రాదులిలా ప్రార్థించారు. "అమ్మా! రమాదేవీ! నీవు నీస్వామి వక్షఃస్థలంపై నిలువు. నిలిచి శేషాద్రిపై సుప్రసిద్ధంగా వెలసి మమ్ము అనుగ్రహించు".

## విష్ణు వక్షంపై లక్ష్మి

"కార్తికశుద్ధ పంచమీ శుక్రవారం ఉత్తరాషాఢా యుక్తమైన ఈ దినం శుభప్రదమైనది. నీ విప్పుడే విష్ణువక్షఃస్థలం చేరాలి. ఇక ఆలస్యమేల?"

లక్ష్మీదేవి ఏమీ పలుకకుండా మౌనం వహించింది. బ్రహ్మ భృగువును చూచి కనుసైగ చేశాడు. అప్పుడు భృగుముని లక్ష్మి చెంత జేరి చేతులు జోడించి "తల్లీ! నా తప్పు మన్నించు. ఇప్పుడైనా నేను నీకు పుత్రుడనని భావించు. హరి వక్షఃస్థలంపై నిలువు" అంటూ ప్రార్థించాడు.

అప్పుడు సహజ జ్ఞానంతో సంతోషాతిశయంతో శ్రీదేవి భృగువు నాదరించి ఇలా అన్నది.

"మునీ! నీ దృఢమైన భక్తికీ, సాటిలేని ధైర్యానికీ మెచ్చాను. సత్త్వగుణాఢ్యుడైన నా దేవుని అనుమానించి ఆనాడు వెళ్ళిపోయాను. రజోగుణ ప్రభావంతో భావికాలగతులు అలా వుండినందువల్ల పతినెడబాసి పరదేశినయ్యాను. పతిచే తీవ్ర తపస్సు చేయించాను. కాలగతి నెవరూ

అతిక్రమించలేరు. ఇది నీ తప్పుకాదు, నాతప్పుకాదు, కపటనాటక సూత్రధారియైన శ్రీహరి కావించే వినోదాలు ఆ దేవునికే ఎఱుక".

ఇలా చెబుతూ భృగుమునిని వీడ్కొని లక్ష్మీదేవి హరి పాదపద్మంపై చూపు నిలిపింది. భక్తితోనూ, ప్రేమతోనూ ఆ స్వర్ణపద్మంలోనే పుత్తడి బొమ్మలాగా ఉండిపోయింది. జగన్నాథుడే తనను ఎత్తి వక్షంపై నిల్పుకొంటాడని భావించింది.

అప్పుడు బ్రహ్మరుద్రులు సిరిని చూచి ఆమె భావం గ్రహించారు. హరికి నమస్కరించి 'జగదీశ్వరా! సాగర కన్యకను ఎత్తి వక్షంపై ఉంచుకో' అని ప్రార్థించారు.

అందుకు శ్రీహరి "ఆ లక్ష్మికెల్లకాలం నివాసమైన ఈ ఉరఃస్థలంపై ఇంకనైనా నిల్వమని చెప్పండి" అని పలికాడు. అప్పుడు వారు "దేవీ! నీ విప్పుడు నీ ప్రాణనాథుని వక్షంపై నిలిచియుండాలి. ఇది మంచి లగ్నం, ఆలసించ వద్దు" అని అన్నారు.

అప్పుడు సకలాభరణభూషితురాలైన లక్ష్మి శరీరంనుండి పుష్ప సౌరభం నలుదెసలకూ వ్యాపించగా పూర్వం క్షీరసాగరం నుండి వెడలి వచ్చినట్లే పద్మసరస్సు నుండి వెడలి పతి చెంతకు వచ్చి నిలిచింది. తన నిలయమైన హరి వక్షఃస్థలాన్ని చందన చర్చితం చేసింది. చేతి కంకణాలు సవ్వడి చేస్తూ వుండగా ఒక పెద్ద పుష్పహారాన్ని హరిమెడలో వుంచింది. లక్ష్మిని చూచి హర్షించి రెండు చేతులతో ఆమెను హత్తుకొని శ్రీహరి తన వక్షఃస్థలంపై నిలుపుకొన్నాడు. అపుడు కుసుమ వృష్టి కురిసింది. దుందుభులు మ్రోగాయి. ఇంద్రాదులు శ్రీహరికి ప్రణమిల్లారు. రంభాదులు ఆడారు. గంధర్వులు పాడారు. కశ్యపాది మునీంద్రులు నిగమాంతసూక్తులతో హరిని కీర్తించారు. పార్వతి, సరస్వతి మంగళారతు లిచ్చి సేసలు చల్లారు. శివుడు, అజుడు



తాపసులతో గూడి వేదపారాయణం చేశారు. విష్ణుదేవు డానందించి శ్రీకాంతతో గూడా గరుడవాహన మధిష్ఠించాడు.

అప్పుడు బ్రహ్మరుద్రులు "మహాలక్ష్మి ఉదయించిన ఈ పద్మ సరస్సులో కార్తిక శుద్ధపంచమినాడు స్నానం చేసిన వారు లక్ష్మీకటాక్ష పాత్రులై సుఖించి ముక్తులవుతారు'' అని ఎలుగెత్తి చాటారు. అందరూ ఆ తీర్థాన్ని ప్రశంసించారు. అందలి జలాన్ని శిరస్సులపై ప్రోక్షించుకొన్నారు. తదుపరి వాహనాలెక్కి ప్రయాణానికి సిద్ధమయ్యారు.

## ఆనందనిలయంలో లక్ష్మీ వేంకటేశ్వరులు

వారితో గూడి లక్ష్మీనారాయణులు వేంకటాద్రి చేరారు. వరాహస్వామి అనుమతితో తమ నివాసమందిరం ప్రవేశించారు. అప్పుడు సకల భూషణాలంకృత అయిన పద్మావతీదేవి ఆనందనిలయం చేరి హరికీ, సిరికీ నమస్కరించింది. పద్మాలయ పద్మావతిని తగిన పద్ధతిలో ఆదరించింది. ఆపై బ్రహ్మాదులకు విందు సమకూర్చి వస్త్రాభరణాదులందించింది. అందరూ సంతుష్టులై లక్ష్మీ నారాయణుల అనుమతితో నిజనివాసాలకు మరలారు.

## లక్ష్మీ వేంకటేశ్వరుల వినోదసంభాషణ

శ్రీవేంకటేశ్వరుడు లక్ష్మీ-పద్మావతీ సమేతుడై సుఖస్థితిలో ఉండి ఒకనాడు లక్ష్మితో "దేవీ! నీరాక నాకు సంతోషం కలిగించింది. పెండ్లికి కుబేరుని వద్ద తీసుకొన్న అప్పు తీరలేదు. ఇందుకు ఉపాయమేమి?" అని అడిగాడు.

"స్వామీ! నేను పెండ్లికి వచ్చినప్పుడు నన్నడిగితే కావలసినంత ధనం ఇచ్చియుందును గదా! అప్పు చేయవలసిన అవసర మేమి?" అని బదులు పలికింది.

"నన్ను ఎడబాసి నీవు చింతిస్తూ వున్నప్పుడు నిన్ను నేనెలా ధనమడుగ గలను?" అని గోవిందుడన్నాడు.

అందుకు లక్ష్మి "జరిగిందేదో జరిగింది. ఇప్పుడు నీవు కోరినంత ధనమిస్తాను. నీ ఋణం తీర్చుకో" అని పలికింది.

అందుకు శ్రీహరి "నీ మహిమ నేనెరుగనా? నీ విప్పుడు ధనం ఈ వద్దు. వడ్డీ క్రమంగా చెల్లిస్తూ కలియుగాంతంలో అప్పు పూర్తిగా తీర్చేస్తాను. ఆపై వైకుంఠం చేరుకుంటాను. అంతవరకూ ఈ శేషాచలంపైననే ఉండి జనులను పాలిస్తాను. వారి పాపాలను పరిహరిస్తాను. ఇంకా చేయవలసిన పనులెన్నో ఉన్నాయి. ఇప్పుడే అప్పు తీర్చవలసిన అవసరం లేదు" అని చెప్పాడు.

మళ్ళీ ఇలా అన్నాడు. ''కలియుగజనులు పాపాలు చేసి రోగగ్రస్తులవుతారు. అప్పుడు నన్ను గురించి మొర పెట్టుకొంటారు. వారిని కాపాడాలి. వారు చేసిన దుష్కర్మలను వారార్జించిన ద్రవ్యం మీదికి ఆకర్షణం చేస్తాను. వారి విపత్తులు తీర్చి వారిచ్చిన ధనం గ్రహించి ఆపాపరూప ద్రవ్యాన్ని అజ్ఞజనుల కిస్తాను. పుణ్యాత్ము లిచ్చే ద్రవ్యంలో కొంత కుబేరునికి వడ్డీగా చెల్లిస్తాను.

రమా! నీ వందరికీ ధన మిమ్ము. ఆ ద్రవ్యాన్ని నేనిక్కడికాకర్షిస్తాను. అవసరమైన వారికిస్తూ నాపరిపాలన కొనసాగిస్తాను. కలియుగాంతం వరకూ ఇలాగే జరగాలి. అందుకు కలియుగ సమాప్తిని గడువుగా పెట్టి ఆనాడు వడ్డీ పత్రం వ్రాసియిచ్చాను.

ఆపై లక్ష్మి ఇలా చెప్పింది. "నీకే ధనమిస్తానంటే వద్దంటున్నావు. జనుల కిమ్మని చెబుతున్నావు. అందులో ఆంతర్యమేమి? కలిలో జనులు కఠినహృదయులు. దానధర్మాది సత్కార్యాలు చేయరు. అందుకే దారిద్ర్యంతో దుఃఖిస్తారు. అలాంటివారికి నేనెలా ధనమిచ్చేది? నీకెంత యిమ్మన్నా, ఇస్తాను నీవే వారి కిచ్చుకో."

అందుకు స్వామి ఈ రీతిగా అన్నాడు. "లక్ష్మీ! మోక్షార్హులైన వారికి ముక్తినీ, పుణ్యం చేసే వారికి పుణ్య ఫలాన్నీ ప్రసాదించి రక్షించడమే నాకు



సమ్మతం. నీవు కలుముల చెలివి. జనులకు కలిమి ఇచ్చే పని నీవంతు. వారి నుండి రూకలు సంగ్రహించి విపత్తులు తొలగించి సంతాన వరాలిచ్చి సంతసించడం నావంతు".

అప్పుడు లక్ష్మి "మనుజులు దానధర్మాలు చేయరు. వారికి నేను సంపద లివ్వడ మెందుకు? వారవి తెచ్చి నీకివ్వడ మెందుకు? ధనం సమకూరగానే దంభ దర్పాది దుర్గుణాలను పెంచుకుంటారు. వారు నిజంగా నీకా ద్రవ్యమిస్తారా?" అని అడిగింది.

అందుకు స్వామి "లక్ష్మీ! నీవు చెప్పింది నిజమే. అయితే ఇందులో ఒక యుక్తి ఉన్నది. జనులు పాపాలు చేసి రోగాలపాలై నన్ను తలచుకొంటారు. వారికి నేను స్వప్నాదులలో సాక్షాత్కరించి వారిచేత ముడుపులు కట్టిస్తాను. దానికి వడ్డీ పెరుగనిచ్చి వారిని ప్రతి సంవత్సరం వేంకటాద్రికి తోడ్కొని వస్తాను. వీరిచ్చిన ద్రవ్యములో పుణ్యపాపవిత్తాలను విభజించి సుజనదుర్జనులకు పంచి యిస్తాను. వారిచే ధర్మకార్యాలు చేయిస్తాను.

కాబట్టి జనులు స్వల్పదానాలు చేసినా వారికి నీవు ధనధాన్యాలు సమృద్ధిగా ఇవ్వాలి. నేను వారి కభయమిచ్చి వారిచే ఇక్కడ దానాలు చేయిస్తాను. ఇక్కడ చేసే దానం స్వల్పమైనా అధికఫలప్రద మవుతుంది. ఈ యుక్తి లేకుంటే కలిపురుషుడు సకలధర్మాలు నశింపజేసి ప్రజలను బాధిస్తాడు. ఇందుకే ప్రజలకు సంపదలిమ్మని నిన్ను కోరాను. ఇప్పుడే అప్పు తీరిస్తే నేనిక్కడ నిరుద్యోగిగా ఉండిపోవలసి వస్తుంది" అని చెప్పాడు.

అంతట లక్ష్మీదేవి "ధన్యాత్మా! నీకు నిజం చెబుతున్నాను. లోకంలో దాన ధర్మాలు చేసి నీకు సమర్పించే వారికే నేను ధనధాన్యాది సంపదలిస్తాను. పాపాత్ముల ద్రవ్యాన్ని నశింపజేస్తాను" అని చెప్పింది.

అందుకు శ్రీవేంకటేశ్వరస్వామి సమ్మతించాడు. జనులందరూ వేంకటాద్రికి వచ్చి ధనరాసులు స్వామికి సమర్పించి స్వామి కృపకు పాత్రులయ్యారు".

ఇలా చెప్పిన దేవదర్శునునితో దేవలు డీరీతిగా అన్నాడు –

"లక్ష్మీదేవి పూర్వశరీరంతో కపిలాశ్రమంలో తపస్సు చేస్తూ వుండిపోయిందన్నావు. ఆమె మళ్ళీ ఈ భూలోకానికి ఎలా వచ్చిందో చెప్పు".

## వీరలక్ష్మి శుకాశ్రమంలో నెలకొనడం

అందుకు దేవదర్శనుడు ఇలా సమాధానం చెప్పాడు –

"లక్ష్మీదేవి సౌశీల్యం కలిగి చిత్తమాదేవునిపై నిలిపి దేహస్మృతి వీడి జగమంతా విష్ణుమయమని భావించింది. తన తపోనిష్ఠ కొనసాగించింది. అలా కొన్ని సంవత్సరాలు గడచాయి.

ఒకనాడు వేంకటేశ్వరస్వామి ఇలా తలపోశాడు–"నేను తనను గూర్చి తపస్సు చేశానని ఇప్పుడు లక్ష్మి కపిలాశ్రమంలో నన్ను గురించి తపస్సు చేస్తున్నది. భూలోకానికి ఆమె తిరిగి వచ్చే ఉపాయం చేస్తాను."

ఇలా అనుకొని ఆ దేవుడు వీరలక్ష్మిహృదయంలో వెలిగే తన రూపాన్ని తిరోధానమయ్యేటట్లు చేశాడు. దానితో ఆమె ధ్యాననిష్ఠ చలించింది. కనులు తెరచి చూస్తే విష్ణుదేవుడు కనిపించలేదు. కొంత కలత జెంది కపిలుని చెంతకు వెళ్ళింది.

కపిలముని ఆమెను విలోకించి "పద్మాక్షీ! చాంచల్యం లేని నీతపస్సు ఫలించింది. ఇక నీవిక్కడ ఉండబనిలేదు. శేషాద్రి దిగువనున్న పద్మసరోవరం చేరుకో. అక్కడ శుకముని పుత్రుడు పాంచరాత్రాగమవిధానంతో నిన్ను పూజిస్తాడు" అని అన్నాడు.



కపిలముని చెప్పినట్లే లక్ష్మి దివ్యరథమధిష్ఠించి మధ్యాహ్నవేళకు పాతాళం నుండి భూమిని భేదించుకొంటూ 108 మంది సేవకులు తన్ను సేవిస్తూండగా శేషాద్రికి దక్షిణ దిశలో నున్న స్వర్ణముఖికి ఉత్తరాన గల పద్మసరోవరం చేరింది. సరస్సు నడుమ వెలసిన లక్ష్మీదేవిని చూచి పారిజాతాలు ఆమెపై చల్లి దేవతలు జయజయ ధ్వానాలు చేశారు.

ఆమె దివ్యదేహ కాంతులు జగమంతా నిండి ప్రసరించాయి. అది చూచి శ్రీనివాసుడు గరుడారూఢుడై అక్కడికి వచ్చాడు. బ్రహ్మరుద్రాదులు గూడా ఆ సమయానికి అక్కడికి చేరుకొన్నారు.

## పద్మతీర్థ ప్రాశస్త్యం

ఆ దినం కార్తిక శుద్ధపంచమీ భృగువారం. ఆనాడు వ్యూహలక్ష్మి శ్రీహరికి ముందుగా కనిపించింది. మరికొంతకాలం తర్వాత అట్టి పవిత్ర దినముననే వీరలక్ష్మి గూడా సాక్షాత్కరించింది. ఇది అందరికీ ముఖ్యదినమని బ్రహ్మాదులు భావించారు. వారు స్వామితో "దేవా! ఈ పుణ్యతీర్థంలోనే వ్యూహలక్ష్మీ, వీరలక్ష్మీ ఇరువురూ ఉదయించారు. ఈ తీర్థానికి పద్మతీర్థమనే పేరు సార్థకంగా ఉంటుంది. అందువల్ల ఈ శుభదినాన పద్మతీర్థంలో స్నానం చేసిన వారు పాపముక్తులై భాగ్యా లనుభవిస్తారు" అని నిర్ణయించి చెప్పారు.

ఆపై అందరూ అందులో స్నానం చేశారు. ఆ తీర్థాని కాగ్నేయ దిశలో విశ్వకర్మచే దివ్యాలయం నిర్మింపజేశారు. వీరలక్ష్మిని ప్రార్థించి తోడ్కొనిపోయి ఆలయంలో నిలిపారు. ఛాయాశుకునిచే పాంచరాత్రా గమవిధానంతో పూజలు చేయించారు.

శ్రీనివాసుడు తన గళసీమలో ఉన్న పుష్పహారాన్ని తీసి ఆ దేవి కంఠంపై ఉంచాడు. శుకాశ్రమాన్ని అగ్రహారంగా రూపొందించి ఛాయాశుకున కప్పగించాడు. అందరినీ అన్ని రీతులా ఆదరించి సాగనంపాడు.

ఆపై స్వామి వీరలక్ష్మితో ఇలా అన్నాడు. "లక్ష్మీ! నీ ప్రథమ శరీరం చూచాను. నీవు వ్యూహలక్ష్మితో గూడి వేంకటాద్రిపైకి వచ్చి నావద్దనే ఉండవచ్చు. అక్కడికి రమ్ము".

అంతట ఆ దేవి శ్రీనివాసునికి నమస్కరించి "ప్రాణనాయకా! నీవు నాకొరకై తపస్సు చేసిన మహా దివ్యస్థలమిది. ఇది శ్రీకరమైనది. ఇది శుకక్షేత్రం, నేను ఇక్కడే నిలుస్తాను. నా హృదయంలో నీవుంటూ వ్యూహలక్ష్మిని నీ వక్షంపై వుంచుకో. నన్నిక్కడే వుంచి రక్షించు. నాకిదే సమ్మతం. నీ కృప నాకు చాలు. నేను రాలేదని చింతించవద్దు. వ్యూహలక్ష్మీరూపంతో నీ ఉరఃస్థలంపై ఉంటాను. ఇంక నీకు కొఱతేమున్నది? పద్మావతిని అరమర లేకుండా ఆదరించు. కొండకు వచ్చే భక్తులకు వరాలు ప్రసాదించు.

కార్తికశుద్ధ పంచమినాడు ప్రియమైన వస్త్రంతో పాటు నీపుష్పహారం నాకు కానుకగా పంపించు. ఇక్కడ జరిగే ఉత్సవాలను నేనంగీకరించి నాహృదయస్థుడవైన నీకు వాటిని సమర్పిస్తాను. నీవా శేషాద్రి మీదనే స్థిరంగా వుండు". అంటూ స్వామి చరణాలకు ప్రణమిల్లింది.

అంతట శ్రీవేంకటేశ్వరస్వామి అందుకంగీకరించి ఆ వీరలక్ష్మిని వీడ్కొని వ్యూహలక్ష్మీ సమేతుడై శేషాద్రికి వచ్చాడు. పద్మావతీ వ్యూహలక్ష్ములతో గూడి క్రీడించాడు.

అక్కడ ఛాయాశుకుడు భక్తితో వీరలక్ష్మికి మహెూత్సవాలు నిర్వహించాడు. ఆ దేవి అందరికీ సకలసంపదలూ ప్రసాదిస్తూ పూజలు స్వీకరిస్తూ అక్కడే వుండి పోయింది.

(మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ రచించిన 'శ్రీవేంకటాచల మాహాత్మ్యం' ఆధారంగా ఈ గ్రంథ రచన జరిగింది – రచయిత)